మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

దినపత్రిక

NETI EVARTHALU

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


శనివారం SATURDAY 20-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 171 Issue: 171

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:43 సూర్యాస్తమయం - సా. 5:41 తిథిః త్రయోదశి రా. 2:32o వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం విశాఖ సా. 5:04 వరకు తరువాత అనురాధ యోగం సుకర్మ మ. 2:13 వరకు కరణం గరజి మ. 1:15 వరకు వనిజ రా. 2:32o వరకు వర్జ్యం రా. 9:40 నుండి రా. 11:28 వరకు దుర్ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:34 వరకు రాహుకాలం మ. 12:12 నుండి మ. 1:34 వరకు యమగండం ఉ. 8:05 నుండి ఉ. 9:27 వరకు గుళికాకాలం ఉ. 10:50 నుండి మ. 12:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:07 నుండి తె. 5:55 వరకు అమృత ఘడియలు ఉ. 7:19 నుండి ఉ. 9:07 వరకు అభిజిత్ ముహూర్తం లేదుజ గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

## తమిళనాడులో 97 లక్షల ఓట్లు తొలగింపు




తమిళనాడులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఆ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 97 లక్షల మంది ఓటర్లను తొలగించారు. 66,44,881 మంది ఓటర్లు బదిలీ అయినట్లుగా, 3,39,278 మంది ఓటర్లు పలు ప్రదేశాల్లో నమోదు చేసుకున్నట్లుగా, 26,94,672 మంది ఓటర్లు మరణించినట్లుగా జాబితాలో పేర్కొన్నారు.


చెన్నై: 2025 అక్టోబర్ 27 నాటికి తమిళనాడులో 6.41 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే 'సర్' ప్రక్రియలో 97 లక్షల మందికిపైగా ఓటర్లను తొలగించడంతో ప్రస్తుతం 5.43 కోట్ల మంది ఓటర్లు మిగిలారు. వీరిలో 2.66 కోట్ల మంది పురుషులు, 2.77 కోట్ల మంది మహిళలు, 7,191 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. మరోవైపు 'సర్' ప్రక్రియలో భాగంగా 2 వ పేజీలో...

## ఏపీలో 18.38 లక్షల జాబ్ కార్డులు రద్దు



ఏపీలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు భారీగా రద్దయ్యాయి. 2025 -26 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 18.38 లక్షల జాబ్ కార్డులు రద్దయ్యాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే ఎక్కువగా జాబ్ కార్డులు రద్దు కావటం గమనార్హం. ఇక అక్టోబర్ 10 నుంచి నవంబర్ 14 మధ్య కాలంలో ఏపీలో 11.07 లక్షల జాబ్ కార్డులు రద్దైనట్లు అధికారులు వెల్లడించారు.

విజయవాడ, డిసెంబర్ 19 (ఈవార్తలు): కేవలం ఐదు వారాల వ్యవధిలోనే 11 లక్షల జాబ్ కార్డులను అధికారులు ఉపాధి హామీ పథకం నుంచి తొలగించారు. ఈ ఐదు నెలల కాలంలో దేశవ్యాప్తంగా 16.31 లక్షల జాబ్ కార్డులు రద్దు కాగా.. అందులో 11 లక్షలు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవి కావటం గమనార్హం. దేశవ్యాప్తంగా రద్దు అయిన కార్డులలో 68 శాతం ఏపీవే. మరోవైపు 2 వ పేజీలో...



2

## సెలబ్రిటీల రూ.8 కోట్ల ఆస్తులు జప్తు

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ భారీ చర్యలు చేపట్టింది. పలువురు సెలబ్రిటీల రూ.7.93 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. ఆస్తులు అటాచ్ అయిన వారిలో యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, ఉర్వశి రౌతేలా, సోనూ సూద్, మిమీ చక్రవర్తి, అంకుష్ హజ్రా, నేహా శర్మ ఉన్నారు.




## 'కుర్ర' దాయాదులు

### యూ-19 ఆసియా కప్ ఫైనల్‌లో భారత్, పాక్

సెమీస్‌లో శ్రీలంకపై భారత్ విజయం

బంగ్లాదేశ్‌పై గెలిచిన పాకిస్థాన్ జట్టు

రేపు ఫైనల్.. క్రికెట్ ఫ్యాన్స్‌కు మరో ట్రీట్

అండర్ 19 ఆసియా కప్ 2025 వన్డే టోర్నీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్‌లో శ్రీలంకతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించగా. భారత కుర్రాళ్లు ఆరోన్ జార్జ్(49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్.. దమ్ముందా?

## పార్టీ మారిన 10 మందితో రాజీనామా చేయిస్తావా?

## వాళ్లతో మళ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేయించగలవా?

### సీఎంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

### 'పంచాయతీ' దెబ్బకు పరిషత్తు ఎన్నికలు వాయిదా: కేటీఆర్




సీఎం రేవంత్ రెడ్డి అన్నట్టుగా రాష్ట్రంలో 66 శాతం ప్రజలు కాంగ్రెస్ పార్టీతోనే ఉంటే.. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడు ఎవరు ఎక్కడున్నారనేది ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో వచ్చేలా లేవని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి మాటలు చూస్తే ఇదే అర్థమవుతుందని అన్నారు.

సిరిసిల్ల, డిసెంబర్ 19 (ఈవార్తలు): కేసీఆర్ ఒక్క మాట మాట్లాడకుండానే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 33 శాతం సీట్లు కొట్టేసరికి రేవంత్ రెడ్డి వెనక్కి పోయిండని ఆరోపించారు. సిరిసిల్ల నియోజకవర్గం లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి అభినంద నలు తెలిపారు. ఈ క్రమంలోనే కేటీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ, పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని చెప్పుకొచ్చారు. కరీంనగర్ పార్లమెంట్‌లో ఒకాయన తరువాయి 2 వ పేజీలో...




## గ్రీన్ కార్డు లాటరీ నిలిపివేత



### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా సంచలనం నిర్ణయం తీసుకున్నారు ఆయన గ్రీన్ కార్డు లాటరీ ప్రోగ్రామ్ పూర్తిగా నిలిపివేశారు. ప్రతి ఏడాది 50 వేల గ్రీన్ కార్డు వీసాలను లాటరీ ద్వారా ఎంపిక చేసి అమెరికాలో నివాసం ఉండేందుకు స్థానం కల్పిస్తుంటారు. ముఖ్యంగా ఈ స్కీం ఉద్దేశం అమెరికాలో తక్కువ ప్రాతినిధ్యం ఉన్నటువంటి దేశాల నుంచి వచ్చే వారికి స్థానం కల్పించేందుకు, వారి నైపుణ్యాన్ని వాడుకునేందుకు ఈ వీసా విధానం ప్రవేశపెట్టారు. ఇందులో పలు ఆఫ్రికా దేశాలకు చెందిన వారు కూడా ఈ స్కీం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే తాజాగా బ్రౌన్ యూనివర్సిటీలో తరువాయి 2 వ పేజీలో...



## భగ్గుమన్న బంగ్లాదేశ్

### మరోసారి చెలరేగిన హింస.. భారత్ వ్యతిరేక అల్లర్లు

రాడికల్ ఇస్లామిస్ట్ హత్యతో ఉద్రిక్తం 2

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,148 |
| వెండి (గ్రాము): | రూ.221 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,535 |



## చెరవీడిన 1700 కోట్ల భూములు

### బాచుపల్లిలో 13 ఎకరాలు సేఫ్

### పాతబస్తీలో 7 ఎకరాలకు మోక్షం

### కబ్జారాయుళ్లపై హైడ్రా కొరడా

నిజాంపేట/హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): అక్రమార్కులపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. తాజాగా రూ.1300 కోట్లు విలువ చేసే హైడ్రా సిబ్బంది కాపాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలో 13 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. ఈ భూమి విలువ దాదాపు తరువాయి 2 వ పేజీలో...

## ప్యాక్స్ పాలక వర్గాలు రద్దు

### డీసీసీబీ పాలక వర్గాలు కూడా

### సర్కారు ఉత్తర్వులు జారీ.. గత ఆగస్టు14తోనే రద్దు

రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) చైర్మన్లు, డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు తొమ్మిది జిల్లాలకు చెందిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల (డీసీసీబి) పాలకవర్గాలను కూడా తొలగిస్తూ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): రాష్ట్రంలోని సహకార సంఘాలకు గత ప్రభుత్వం హయాంలో 2020 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగాయి. నిబంధనల ప్రకారం ఐదేళ్ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితోనే ముగిసింది. అయితే, పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా అప్పట్లో ప్రభుత్వం వీరి పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఆ పొడిగింపు గడువు కూడా ఆగస్టు 14వ తేదీతోనే పూర్తి కావడంతో, ప్రస్తుత ప్రభుత్వం పాత పాలకవర్గాలను పూర్తిగా రద్దు చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘాలు వెన్నెముక వంటివి. రైతులకు అవసరమైన తక్షణ సాయాన్ని అందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. సాగు అవసరాల కోసం రైతులకు స్వల్పకాలిక , మధ్యకాలిక రుణాలను అందజేయడం చేస్తుంటాయి. వీటితో పాటు.. సొసైటీల ద్వారా సబ్సిడీపై తరువాయి 2 వ పేజీలో...




2

## పొగతో తల్ల'ఢిల్లీ'!

### దేశ రాజధానిని కప్పేసిన కాలుష్యం.. పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి

### 150 విమానాలు రద్దు.. ముందు ఏముందో తెలియని పరిస్థితి

## విశ్వవాణి



నార్వేలో జైళ్లు మన దేశంలో ఉన్నట్లు ఉండవు. చిన్నపాటి అపార్టుమెంట్లలా ఉంటాయి. అందులో కిచెన్, టీవీ, బెడ్ లాంటి సదుపాయాలు కూడా ఉంటాయి. తప్పు చేసినవాళ్లకు శిక్ష విధించడం కంటే.. వాళ్లు ఆ పని చేయకుండా ఉండే వాతావరణం కల్పించడమే మేలు అన్న ఉద్దేశంతో జైళ్లను ఇంటి వాతావరణాన్ని తలపించేలా ఉంచుతారట.



# 41 మంది నక్సల్స్ సరెండర్

### డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగుబాటు.. ఇద్దరు తెలంగాణ, 39 మంది ఛత్తీస్‌గఢ్ వాసులు

తెలంగాణలో మావోయిస్టు పార్టీకి భారీ దెబ్బ తగిలింది. ఏకంగా 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మావోయిస్టులు ఆయుధాలు వీడారు. మావోయిస్టులు లొంగిపోవడాన్ని డీజీపీ శివధర్ రెడ్డి స్వాగతించారు.

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): మీడియాతో మాట్లాడుతూ.. 24 ఆయుధాలతో 41 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన 41 మందిలో ఇద్దరు తెలంగాణ వారు కాగా, 39 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారున్నారని వివరించారు. తెలంగాణకు చెందిన వారిలో.. కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రగుళ్ల రవి, మంచిర్యాలకు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

20.12.2025

మేషం: వ్యాపారాలు ఉన్నతికి చేసిన శ్రమ ఫలిస్తుంది. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. వృత్తి ఉద్యోగములలో సమస్యలను తెలివితేటలతో అధిగమిస్తారు. కొన్ని వ్యవహారాలలో ఆత్మీయులు సలహాలు తీసుకొని ముందుకు సాగడం మంచిది. అవసరానికి ధన సహాయం అందుతుంది.

వృషభం: మానసికంగా ప్రశాంతత లభిస్తుంది. వ్యాపారాలు లాభాలబాట పడతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగమున మీ విలువ పెరుగుతుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చాలా రోజులుగా ఉన్న సమస్యలు తొలగుతాయి.

మిధునం: వృధాప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట నూతన సమస్యలు ఉత్పన్నమౌతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. రుణ భారం అధికమౌతుంది. వృత్తి వ్యాపారాలలో నిలకడ లోపిస్తుంది. ఉద్యోగమున అదనపు భాధ్యతలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలలో స్థిరత్వం లేని ఆలోచనలు వలన నష్టాలుంటాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు వింటారు. ఉద్యోగమున ఆశించిన పురోగతి సాధిస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు ఆర్ధిక విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వ్యాపారాలకు మిత్రుల నుండి పెట్టుబడులకు ధన సహాయం అందుతుంది.

కన్య: ధన వ్యవహారాలు కలసివస్తాయి. మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగుల కలలు సాకరమౌతాయి. నూతన వాహనం కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి.

తుల: కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృశ్చికం: వ్యాపారామున భాగస్థులతో వివాదాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వలన సకాలంలో పనులు పూర్తి కావు. వృత్తి ఉద్యోగాలలో చిన్నపాటి సమస్యలు ఉంటాయి. బంధువుల నుండి ఊహించని ఒత్తిడి కలుగుతుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలలో శ్రద్ధ వహించాలి.

ధనస్సు: ఉద్యోగమున వివాదాలు పరిష్కారమౌతాయి. కుటుంబ సభ్యుల సహాయంతో చాలకాలంగా పూర్తి కానీ పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమిస్తారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తుంది.

మకరం: ఉద్యోగమున స్థానచలన సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామితో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో కష్టానికి తగిన ఫలితం లభించదు. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తికాక చికాకులు పెరుగుతాయి.

కుంభం: ఆత్మీయులతో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్ధిక పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తికావు. నిరుద్యోగ ప్రయత్నాలు కలసిరావు. బంధువర్గం నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది.



# రేవంత్.. దమ్ముందా?

మొదటి పేజీ తరువాయి

ఏం చేయకపోయినా గాలి మాటలు చెప్పి గెలిచిపోతున్నాడని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని, కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికార పార్టీ దౌర్జన్యాలను ఎదుర్కొని సిరిసిల్ల నియోజకవర్గంలోని 117 గ్రామ పంచాయతీలకు గాను 80 చోట్ల బీఆర్ఎస్ మద్దతుదారులు అఖండ విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని... వాటిని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదని, సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయని.. ఇప్పుడు పగలు, పంచాయితీలు పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని.. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని మండిపడ్డారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని విమర్శించారు. ఇప్పట్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు లేకుంటే.. జనవరి నుంచి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, కొత్త కమిటీల ఏర్పాటు చేపట్టాలని కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు. కొత్త రక్తం, పాత తరం అందరిని కలుపుకొని కమిటీలు వేసుకుందామని అన్నారని పేర్కొన్నారు.



# ‘కుర్ర’ దాయాదులు

మొదటి పేజీ తరువాయి

మల్హోత్రా(45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. కెప్టెన్ విమత్ దిన్సారా(29 బంతుల్లో 4 ఫోర్లతో 32), చమికా హీనాటిగలా(38 బంతుల్లో 3 ఫోర్లతో 42) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో హెనిల్ పటేల్, కాన్షిక్ చౌహన్ రెండేసి వికెట్లు తీయగా.. కిషన్ సింగ్, దీపేష్ దేవంద్రన్, ఖిలాన్ పటేల్ తలో వికెట్ తీసారు. అనంతరం భారత అండర్ 19 టీమ్ 18 ఓవర్లలో 2 వికెట్లకు 139 పరుగులు చేసి మరో 12 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(7)తో పాటు వైభవ్ సూర్యవంశీ(9) విఫలమైనా.. ఆరోన్ జార్జ్(49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ మల్హోత్రా(45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సలతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో రసిత్ నిమ్సారా(2/31) ఒక్కడే రెండు వికెట్లు తీసాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో విహాన్ మల్హోత్రాను ఆర్‌సీబీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ అండర్ 19 టీమ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 27 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 121 పరుగులకు ఆలౌటైంది. అనంతరం పాకిస్థాన్ 16.3 ఓవర్లలోనే 2 వికెట్లకు 122 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి.



# చెరవీడిన 1700 కోట్ల భూములు

మొదటి పేజీ తరువాయి

రూ.1300 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. సర్వే నంబరు 186, 191తో పాటు 334లలో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని.. కాపాడాలని బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు హైడ్రాను కోరారు. ఇప్పటికే కొంత భూమి ఆక్రమణలకు గురి అయ్యిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబరు 334లో ఇప్పటికే 4 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలు జరిగి శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్లు నిర్ధారించారు. నివాసాల జోలికి వెళ్లకుండా అక్కడ మిగిలి ఉన్న 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడారు. అందులో వేసిన తాత్కాలిక షెడ్డులను హైడ్రా తొలగించింది. ఆ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అటు.. పాత బస్తీలో హైడ్రా ఏడు ఎకరాల భూమిని కాపాడింది. బండ్లగూడ మండలం కందికల్ విలేజ్‌లోని మొహమ్మద్‌నగర్–లాలితాబాగ్ ప్రాంతం, రైల్వే ట్రాక్ సమీపంలో టౌన్ సర్వే నంబర్ 28, బ్లాక్ ఎఫ్, వార్డు నంబర్ 274లో మొత్తం 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇప్పటికే 2 ఎకరాలు కబ్జా అయి.. నివాసాలు వచ్చేశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా కబ్జాలో ఉన్న 7 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. అక్కడ ఉన్న చెరువును కబ్జా చేసి షెడ్లు నిర్మించారు. ఇప్పటికే దానిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్న కబ్జాదారులు తమ భూమి అంటూ కోర్టులో కేసు వేశారు. అయితే కోర్టు ప్రభుత్వ భూమి అని స్పష్టం చేసింది. ఈ క్రమంలో శుక్రవారం హైడ్రా అధికారులు 7 ఎకరాల భూమిని కాపాడారు. దాని విలువ దాదాపు రూ. 400 కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

## తమిళనాడులో 97 లక్షల ఓట్లు తొలగింపు

మొదటి పేజీ తరువాయి

రాజధాని చెన్నైలో అత్యధికంగా 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. దీంతో చెన్నై ఓటర్ల సంఖ్య 40.04 లక్షల నుంచి 25.79 లక్షలకు తగ్గింది. 12.22 లక్షల మంది ఓటర్లు బదిలీ అయినట్లు, 1.56 లక్షల మంది మరణించినట్లు, 27,323 మంది ఓటర్లు చిరునామాలో కనిపించలేదని, 18,772 ద్వంద్వ ఓటింగ్ కేసులు ఉన్నట్లు ముసాయిదా ఓటర్ జాబితాలో పేర్కొన్నారు. కోయంబత్తూరులో 6.50 లక్షలు, దిండిగల్ జిల్లాలో 2.34 లక్షల మంది ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కరూర్‌లో 79,690 మంది ఓటర్లను, కాంచీపురం జిల్లాలో 2.74 లక్షల మంది ఓటర్లను తొలగించారు. షోలింగనల్లూరు, పల్లవరం నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో ఓటర్ల తొలగింపు నమోదైనట్లు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారిణి అర్చన పట్నాయక్ తెలిపారు. కొన్ని వర్గాల ఓటర్లను తొలగించినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఏ ఓటరు పేరును ఏకపక్షంగా తొలగించలేదని మీడియాతో పేర్కొన్నారు.

## సెలబ్రిటీల రూ.8 కోట్ల ఆస్తులు జప్తు

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ భారీ చర్యలు చేపట్టింది. పలువురు సెలబ్రిటీల రూ.7.93 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. ఆస్తులు అటాచ్ అయిన వారిలో యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, ఉర్వశి రౌతేలా, సోనూ సూద్, మిమీ చక్రవర్తి, అంకుష్ హజ్రా, నేహా శర్మ ఉన్నారు. యువరాజ్ సింగ్ 2.5 కోట్లు, రాబిన్ ఉతప్ప 8.26 లక్షలు, ఉర్వశి రౌతేలా 2.02 కోట్లు (ఈ ఆస్తి ఆమె తల్లి పేరు మీద ఉంది),సోనూ సూద్ 1 కోటి, మిమీ చక్రవర్తి 59 లక్షలు, అంకుష్ హజ్రా 47.20 లక్షలు, నేహా శర్మ 1.26 కోట్లు ఉన్నాయి. ఇంతకుముందు ఇదే కేసులో ఈడీ శిఖర్ ధావన్ రూ.4.55 కోట్లు, సురేశ్ రైనా రూ. 6.64 కోట్లను అటాచ్ చేసింది. మొత్తంగా ఇప్పటి వరకు వన్ ఎక్స్ బెట్ కేసులోఈడీ 19.07 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది.

## ఏపీలో 18.38 లక్షల జాబ్ కార్డులు రద్దు

మొదటి పేజీ తరువాయి

ఈ ఐదు నెలల కాలంలో మిగతా రాష్ట్రాలలో కనీసం లక్ష జాబ్ కార్డులు కూడా రద్దు కాలేదు. కానీ ఏపీలో మాత్రం ఈ సంఖ్య 11 లక్షలుగా ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది. తెలంగాణలో 95,084, ఒడిశా 80,896, జమ్మూకశ్మీర్ 79,070 జాబ్ కార్డులు రద్దైనట్లు అధికారులు వెల్లడించారు.

## గ్రీన్ కార్డు లాటరీ నిలిపివేత

మొదటి పేజీ తరువాయి

జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు మృతి చెందారు. అయితే ఈ కాల్పులకు పాల్పడినటువంటి నిందితుడు పోర్చుగీసు దేశానికి చెందిన వాడని అతను గ్రీన్ కార్డు సిస్టం ద్వారా అమెరికాలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. దీంతో ట్రంప్ ఈ గ్రీన్ కార్డు విధానం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రోగ్రాం లో నిలిపివేయాలని యుఎస్ సిటిజెన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ కు ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ నిర్ణయం భారతీయుల్లో ఆందోళన నింపుతోంది. ఎందుకంటే వేల మంది భారతీయులు గ్రీన్ కార్డు కోసం అమెరికాలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడానికి ఎదురు చూస్తూ ఉంటారు. అయితే, తాజాగా ఈ గ్రీన్ కార్డు ప్రోగ్రాంను తాత్కాలికంగా నిలిపివేయడం అనేది నేరుగా అంత ప్రత్యక్ష ప్రభావం ఉండకపోవచ్చు అని విదేశాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వీసా ప్రోగ్రాం లో 2028 వరకు గ్రీన్ కార్డ్ లాటరీకి భారతీయులు అర్హులు కాదు. కాబట్టి ఇది తాత్కాలికమైన నిలిపివేత, భవిష్యత్తులో అప్లై చేసుకునే వారిపైన నేరుగా ప్రభావితం చేయదని పేర్కొంటున్నారు.

# ప్యాక్స్ పాలక వర్గాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకు సరఫరా చేస్తాయి. ప్రభుత్వం మద్దతు ధరతో చేపట్టే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పీఏసీఎస్ కీలక బాధ్యత వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే వ్యవసాయ అనుబంధ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం కూడా దీని బాధ్యత. పాలకవర్గాల రద్దు నేపథ్యంలో.. పీఏసీఎస్, డీసీసీబీల నిర్వహణ స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు లేదా కొత్త ఉత్తర్వులు వచ్చే వరకు ఈ సంస్థల బాధ్యతలను పర్సన్ ఇన్ చార్జ్ కమిటీలకు లేదా ప్రభుత్వ అధికారులకు అప్పగించనున్నారు. ముఖ్యంగా తొమ్మిది జిల్లాల డీసీసీబీలకు జిల్లా కలెక్టర్లను బాధ్యులుగా నియమించడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో సహకార ఎన్నికలకు మార్గం సుగమం కానుంది. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఈ సంఘాలను పునర్వ్యవస్థీకరించే అవకాశం కూడా ఉందని సమాచారం.

DCCB



# నక్సల్స్ సరెండర్

మొదటి పేజీ తరువాయి

చెందిన కనికారపు ప్రభంజన్ ఉన్నారని తెలిపారు. ఏకే–47లు 3, ఎల్ఎమ్‌జీ 1, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు 5, ఇన్సాస్ రైఫిళ్ళు 7, బీజీఎల్ గన్ 1, 303 రైఫిళ్ళు 4, సింగిల్ షాట్ రైఫిల్ 1 , ఎయిర్ గన్స్ 2 మొత్తం 24 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యులకు రూ. 4 లక్షలు, సభ్యులకు రూ.4 లక్షల రివార్డు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయుధాలతో లొంగిపోతే వారికి మరింత నగదును రివార్డ్స్ కింద అందజేస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. మ్నొత్తం 41 మందికి కోటి 47 లక్షల రివార్డ్స్ అందిస్తున్నామని... తక్షణ సహాయం కింద రూ.25 వేలు ఇస్తున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. తెలంగాణకు చెందిన 54 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే వీరిలో 5 మంది సెంట్రల్ కమిటీలో ఉండగా, 8 మంది స్టేట్ కమిటీలో ఉన్నట్లు చెప్పారు. వీరితోపాటు 13 మంది డివిజన్ కమిటీ , 12 మంది కిందిస్థాయిలో సభ్యులుగా ఉన్నట్లు వివరించారు. మ్నొత్తం 54 మందిలో 48 మంది వేరే రాష్ట్రాల్లో పని చేస్తుండగా, ఏడుగురు తెలంగాణలో ఉన్నట్లు గుర్తించామని ప్రకటించారు.



# ఈజేహెచ్‌ఎస్‌కు 'సూపర్' సేవలు

## వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సేవల విస్తరణ.. జర్నలిస్టులు, ఉద్యోగులకు సర్కారు శుభవార్త

**నిమ్స్ పరిధిలోకి కూకట్‌పల్లి, ఖైరతాబాద్ సెంటర్లు**

**మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పరిధిలో మరో 10**

**అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు**

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): ఉద్యోగులు, జర్నలిస్టులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈజేహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్) వెల్‌నెస్ సెంటర్లలో సేవలను విస్తరించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే అంశంపై మంత్రి శుక్రవారం అధికారులతో సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈజేహెచ్‌ఎస్ పరిధిలోని జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నిర్వహిస్తోంది. సేవల విస్తరణ ప్రణాళికలో భాగంగా.. ఖైరతాబాద్, కూకట్‌పల్లి వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను నిమ్స్‌కు, మిగిలిన 10 వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మెడిసిన్, డెంటల్, ఫిజియోథెరపీ వంటి సేవలను వెల్‌నెస్ సెంటర్లు అందిస్తున్నాయి. కొన్నిచోట్ల గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ సేవలు అందుతున్నాయి. ఇకపై జనరల్ సర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్స్, న్యూరాలజీ, డెర్మటాలజీ వంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను కూడా వెల్‌నెస్ సెంటర్లలో దశలవారీగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయా స్పెషాలిటీలకు సంబంధించిన డాక్టర్లను, సిబ్బందిని వెల్‌నెస్ సెంటర్లలో నియమించడంతో పాటు, పేషెంట్లకు టెస్టులు చేసేందుకు అవసరమైన పరికరాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెంటర్లలో పేషెంట్లకు అవసరమైన వెయిటింగ్ ఏరియా, ఇతర సౌకర్యాలను మెరుగుపర్చాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్లలో మెడిసిన్స్ అందుబాటులో లేవంటూ ఉద్యోగులు, జర్నలిస్టుల నుంచి ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఉండకూడదన్నారు. అవసరమైన అన్నిరకాల మెడిసిన్స్‌ను అన్ని వెల్‌నెస్ సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మెడిసిన్ ఇండెంట్ నుంచి కొనుగోలు వరకూ పూర్తి ప్రక్రియ డిజిటల్‌గానే జరగాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు, సప్లైలో జాప్యం ఉండకూడదన్నారు. ఆన్‌లైన్‌లో ఓపీ బుక్ చేసుకునేందుకు వీలుగా యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.



## నల్సార్ ప్రొఫెసర్‌గా మాజీ సీజేఐ గవాయ్

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్‌గా మాజీ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. రాజ్యాంగం, న్యాయ లభ్యత వంటి అంశాల్లో రిసెర్చ్, బోధన, విద్యా పరమైన కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు. అలాగే, డాక్టర్ అనురాగ్ భాస్కర్‌ను అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా, చైర్ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు యూనివర్సిటీ తెలిపింది. సీనియర్ అడ్వకేట్ కే పరమేశ్వర్‌ను కూడా అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా నియమించింది.

## సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని మోండా మార్కెట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఇక్కడి శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. మోండా మార్కెట్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో, అగ్ని ప్రమాదం జరిగి దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు చుట్టుపక్కల దుకాణాలకు వ్యాపించకుండా నిరోధించారు. అగ్ని ప్రమాదం సంభవించిన దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు అధికంగా ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

## అసమర్థుడి జీవయాత్రలా కేటీఆర్ టూర్లు

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఫైర్**



నాంపల్లి/హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోయినా.. మాజీ మంత్రి కేటీఆర్ విజయోత్సవ సభలు నిర్వహించడం చూస్తుంటే జాలేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ పర్యటనలు "అసమర్థుడి జీవయాత్ర"లా ఉన్నాయని, ఓడిపోయిన సర్పంచ్‌లను ఓదార్చడానికి ఓదార్పు యాత్రలు చేస్తున్నారా అని సెటైర్లు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12,728 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, 53 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారని బీర్ల ఐలయ్య తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి కేవలం 33 శాతం స్థానాలకే పరిమితమయ్యాయని గుర్తు చేశారు. ముఖ్యంగా యాదాద్రి జిల్లాలో 60 శాతం స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుందని ఆయన వివరించారు. పార్టీ ఘోరంగా ఓడిపోయినా ఇలాంటి సభలు పెట్టడం చూస్తే కేటీఆర్ మానసిక స్థితిపై అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. తాము బెదిరిస్తే బీఆర్‌ఎస్ నుంచి వేల మంది సర్పంచ్‌లు ఎలా గెలిచారని ప్రశ్నించారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రతిపక్షాల నుంచి గెలిచిన వారిని ప్రలోభపెట్టి పార్టీలో చేర్చుకుందని ఆరోపించారు. కవిత దెబ్బకు బీఆర్‌ఎస్ పార్టీ కూలిపోతోందని, హరీశ్ రావు వంటి నేతలు పార్టీకి గుండు కొట్టే పనిలో ఉన్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. బీఆర్‌ఎస్ పని ఖతమైందని, రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80 శాతం సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే కేటీఆర్ నాలుక కోస్తామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## మంత్రి పదవి కోసం చూస్తున్నా

**త్వరలోనే మంచి పదవి లభిస్తుంది.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన మంత్రి పదవి ఆశలపై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదృష్టం ఉంటే తనకు త్వరలోనే మంచి పదవి లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు ఓపిక పట్టానని, త్వరలోనే మంత్రిని అవుతానని ఆయన అన్నారు. ఆయన తాజా వ్యాఖ్యలతో మంత్రి పదవి అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. చాలాకాలంగా మంత్రి పదవిని ఆశిస్తున్న రాజగోపాల్ రెడ్డి, ఈ విషయంపై పలుమార్లు బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు. కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలో అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు అది నెరవేరలేదని గతంలో మీడియా సమావేశాల్లో వ్యాఖ్యానించారు. పార్టీలోని పరిణామాలపై కూడా కొన్ని సందర్భాల్లో ఆయన వివాదాస్పదంగా మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని, అదే మంత్రి పదవి లభిస్తే నియోజకవర్గాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అయితే, గతంలో అసహనంతో మాట్లాడిన ఆయన, ఇప్పుడు సానుకూల ధోరణితో మాట్లాడుతుండడంతో రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. అధిష్ఠానం నుంచి మంత్రి పదవిపై ఆయనకు ఏమైనా సానుకూల సంకేతాలు అందాయా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## మైనర్‌కు పెళ్లి.. తండ్రికి జీవితఖైదు

**రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పు**

ఎల్బీనగర్/రంగారెడ్డి, డిసెంబర్ 19 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లాలోని పోక్సో న్యాయస్థానం ఒక సంచలన తీర్పును వెలువరించింది. 17 ఏళ్ల బాలికతో బలవంతపు వివాహం, అత్యాచారం కేసులో నిందితులకు శిక్ష ఖరారు చేసింది. ఆమె భర్తకు, తండ్రికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. 2018 సంవత్సరంలో హైదరాబాద్‌లోని సరూర్ నగర్ పరిధిలో ఈ బాలికకు బలవంతంగా వివాహం జరిపించారు. ఈ కేసులో బాలిక భర్తకు, తండ్రికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.75 వేల చొప్పున జరిమానా విధించింది. అంతేకాకుండా, బాధితురాలికి రూ.15 లక్షల నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## ప్రజావాణి కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్: భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజావాణి ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లలో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడించారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆక్షేపించారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన బీఆర్‌ఎస్ ఎన్ని విమర్శలు చేసినా తాము మరింత ముందుకు వెళతామని ఆయన అన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## సిడ్నీ కాల్పులతో హైదరాబాద్‌కు లింక్ లేదు

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికీ, ఆ ఉగ్ర ఘటనతో హైదరాబాద్‌కు సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో యూదులపై కాల్పులు జరిపిన వారిలో సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలు ఉన్నట్లు బయటపడింది. పాతబస్తీకి చెందిన అతడు 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లి, అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని స్థిరపడ్డాడు. సాజిద్‌కు హైదరాబాద్ మూలాలు ఉండటంతో, ఈ కాల్పుల ఘటనపై డీజీపీ మరోసారి స్పందించారు. 1998లో ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్ ఆరుసార్లు భారత్ వచ్చాడని, ఆస్ట్రేలియాలోనే యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్న తర్వాత 1998లో భార్యతో పాటు ఒకసారి హైదరాబాద్‌కు వచ్చాడని వెల్లడించారు.

## నరేగా పేరు మార్పు సరికాదు

**బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్**




హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగింపు అంశంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ స్పందించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని, చట్టాన్ని మెరుగుపరుస్తున్నామనే సాకుతో మార్పులు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' తీసుకువచ్చిందని అన్నారు. గతంలో 'నరేగా' పథకం కింద కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను భరించగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాలని నిబంధన విధించడం శోచనీయమని ఆయన అన్నారు. పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని చేసిన పోరాటాల ఫలితంగా పార్లమెంటులో చట్టం ఆమోదం పొందినప్పుడు తామంతా మద్దతు తెలిపినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ ప్రాథమిక హక్కును నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేస్తేనే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందనే నిబంధన అసంబద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు ఆర్థికంగా అంత బలంగా లేవని, ఆ రాష్ట్రాలు 40 శాతం నిధులు ఇవ్వలేవని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త విధానం ఆయా రాష్ట్రాల్లో పేదరికాన్ని మరింత పెంచే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, రద్దు చేసే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నరేగా పథకం ద్వారా దేశంలో 8.9 కోట్ల మంది ప్రజలు జాబ్ కార్డులు పొంది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారని, ఈ పథకాన్ని రద్దు చేస్తే వీరందరికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.




## క్రీడలతో చదువులో చురుకు: సైనానెహ్వాల్

హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): క్రీడలు ఆరోగ్యకరమైన చైతన్యవంతమైన సమాజానికి మూలస్తంభం అని భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మభూషణ్ సైనా నెహ్వాల్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణిస్తారని ఆమె అన్నారు. శుక్రవారం హైదరాబాద్, క్రీడాపోటీల ముగింపు ఉత్సవాలకు భారత బాడ్మింటన్ స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ డా. అనిల్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైనా బాడ్మింటన్ ఆడారు. అనంతరం క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థిని, విద్యార్థులకు ట్రోఫీలు, కప్, సర్టిఫికెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్ మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలు మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అన్నారు. క్రీడలు వ్యక్తిత్వాన్ని రూపొందించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, క్రమశిక్షణ ని నేర్పిస్తాయని ఆమె తెలిపారు. తమ రోజువారీ షెడ్యూల్‌లో క్రీడలను చేర్చి, క్రమం తప్పకుండా క్రీడా పోటీలు, టోర్నమెంట్‌లు నిర్వహించాలని సైనా నెహ్వాల్ కోరారు. డా. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించి క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి ప్రతి క్రీడలలో విద్యార్థులకు పాల్గొనేలా చేసి దేశీయ, అంతర్జాతీయ పోటీలకు పంపడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఎస్‌ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్ లు అంజనీ కుమార్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, గర్వ అగర్వాల్, స్పోర్ట్స్ చీఫ్ కోచ్ డా. మురమళ్ళ భారత్ కుమార్, అడ్మిన్ హెడ్ వినోద రంజన్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, హెడ్ ఆఫ్ బోర్డింగ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో సినిమాలు తీయండి

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపు.. ఐమ్యాక్స్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివెల్ ప్రారంభం**

**నేడు, రేపు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్ట్**

ఖైరతాబాద్/హైదరాబాద్, డిసెంబర్ 19 (ఈవార్తలు): రాష్ట్రంలో సినిమాలు సులభంగా, సౌకర్యవంతంగా నిర్మించుకునేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో సినిమా, టెలివిజన్ ఎకో సిస్టంను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఇక్కడ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణకు ఒక మైలురాయిగా ఆయన పేర్కొన్నారు. యువ ప్రతిభావంతులను వెలికితీయడానికి, కొత్త ఆలోచనలకు అంకురార్పణ చేయడానికి లఘు చిత్రాలు దోహదపడతాయని ఆయన అన్నారు. సినిమాలలో ప్రజల సంస్కృతి, జీవన విధానం ప్రతిబింబించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎఫ్‌డీసీ, దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐమ్యాక్స్‌లో రేపు, ఎల్లుండి ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. దాదాపు 10 దేశాల నుంచి 700కు పైగా లఘు చిత్రాలు ప్రదర్శనకు రాగా, జ్యూరీ సభ్యులు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ప్రదర్శిస్తారు.

# గుళ్లకు రాయితీపై మైక్‌సెట్

**శేషవస్త్రం, రాతి, పంచలోహ విగ్రహాలు కూడా**

**భక్తుల కోసం టీటీడీ కీలక నిర్ణయాలు**



తిరుమల, డిసెంబర్ 19 (ఈవార్తలు): ప్రపంచ ప్రఖ్యాత హైందవ సంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం మరో కీలక నిర్ణయం తీసుకుంది.సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా హిందువుల ఆలయాలకు మైక్ సెట్, గొడుగులు, శేషవస్త్రం, రాతి, పంచలోహ విగ్రహాలను రాయితీపై ఇవ్వాలని నిర్ణయించింది. నిబంధనలకు అనుగుణంగా డీడీతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను కార్యనిర్వహణాధికారి, టీటీడీ పరిపాలన భవనం, కేటీరోడ్డు, తిరుపతి అనే చిరునామాకు పంపాలి. ఇతర వివరాలకు 0877-2264276 అనే నంబరులో సంప్రదించాలని సూచించింది.

**మైక్ సెట్:** మైక్ సెట్ కొనుగోలుకు అయ్యే ఖర్చు రూ.25,000లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన ఎస్సీ,ఎస్టీలకు 90% రాయితీ మినహాయించి రూ.2,500/-డీడీ తీసి పంపించాల్సి ఉంటుంది. ఇతరులకు 50% రాయితీ మినహాయించి రూ.12,500/- చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆలయ కమిటీ దరఖాస్తు పత్రం, సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నుండి సిఫార్సు లేఖ, ఆలయ ఫొటో, ఆలయ కరెంట్ బిల్లు, దరఖాస్తుదారు ఆధార్ కార్డును జత చేయాలి అని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

**గొడుగులు:** హిందూ దేవాలయాలకు కేటగిరీలతో సంబంధం లేకుండా అర్హులైన దరఖాస్తుదారులకు రూ.14,500 విలువ చేసే గొడుగులను 50% రాయితీతో రూ.7,250లకే అందిస్తున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందుకోసం ఆలయ కమిటీ దరఖాస్తు పత్రం, సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌తో సదరు శాఖ సిఫార్సు లేఖ, దరఖాస్తుదారు ఆధార్ కార్డ్, ఆలయ ఫొటోను జత చేసి దరఖాస్తు చేయాలి. సదరు పత్రాలతోపాటు రాయితీ మినహాయించి రూ.7,250/- లకు డీడీని జత చేసి పంపాలి అని టీటీడీ తెలిపింది.

**శేష వస్త్రం:** హిందూ దేవాలయాలకు ఉచితంగా శేష వస్త్రాన్ని టీటీడీ ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఆలయ అభ్యర్థన లేఖను కార్యనిర్వాణాధికారి, తిరుపతి పేరుతో దరఖాస్తు చేయాలి. సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ / అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ నుండి సిపార్సు లేఖ..దరఖాస్తు దారు ఆధార్ కార్డు, ఆలయ ఫోటోను జత చేయాల్సి ఉంటుంది అని టీటీడీ పేర్కొంది.

**రాతి, పంచలోహ విగ్రహాలు:** శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతీ అమ్మవారి రాతి విగ్రహాలను 5 అడుగులు, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న విగ్రహాలను ఉచితంగా అందిస్తారు. మిగిలిన దేవతా విగ్రహాలకు 75 శాతం సబ్సిడీపై కేవలం 25% ధరను చెల్లిస్తే వివిధ వర్గాల వారికి అందిస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి ఉచితంగా రాతి విగ్రహాలను అందిస్తారు. పంచలోహ విగ్రహాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి 90% సబ్సిడీతో, ఇతర వర్గాల వారికి 75% సబ్సిడీతో అందిస్తారు. దేవతా మూర్తుల రాతి, పంచలోహల విగ్రహాల పేర్లు, కొలతలతో కార్యనిర్వహణాధికారి, టీటీడీ వారికి ఆలయ అభ్యర్థన లేఖ పంపించాలి. దరఖాస్తుదారులు కచ్చితంగా స్థానిక తహసీల్దార్ / అసిస్టెంట్ కమీషనర్ నుండి సదరు ఎండోమెంట్ శాఖ తాజా సిఫార్సు లేఖ, ఆలయ బ్లూ ప్రింట్‌ను ఏ4 సైజ్ లో, అవసరమైన విగ్రహాల డ్రాయింగ్, ఒరిజినల్ ఆలయ ఫోటో, దరఖాస్తుదారు ఆధార్ కార్డును జత చేయాలి. ఎంఈవో లేదా డీఈవోలతో ఆమోదం పొందిన విద్యాసంస్థలకు సరస్వతీ దేవీ రాతి విగ్రహాన్ని 50% సబ్సిడీతో టీటీడీ అందిస్తోంది. మఠాలు, ట్రస్ట్‌లకు, ఆశ్రమాలకు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను 50% రాయితీతో టీటీడీ అందించనుంది.

# గోదావరి పుష్కరాలకు మాస్టర్ ప్లాన్

## ధర్మపురిలో సౌకర్యాలపై జగిత్యాల కలెక్టర్ సమీక్ష



జగిత్యాల, డిసెంబర్ 19 (ఈవార్తలు): జూలై 2027లో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని పుష్కరాలపై కలిసి చేపట్టిన ప్రాథమిక సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధర్మపురిలోని గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లు, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. 2027లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రవేశించే గోదావరి నది తీరం వెంట ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులకు సూచించారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లతో పాటు భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలన్నీ ఉండేలా ప్లాన్ చేయాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, బీ రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విశాఖ, విజయవాడకు

# మెట్రో ఇవ్వండి

**కేంద్రమంత్రి ఖట్టర్‌కు చంద్రబాబు విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా, శుక్రవారం కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడలలో మెట్రో రైలు ప్రాజెక్టులను వెంటనే ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ రెండు నగరాల్లో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలు అత్యంత ఆవశ్యకమని చంద్రబాబు మంత్రికి వివరించారు. మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ డీపీఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.



# నితిన్ నబీన్‌తో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీలో భేటీ అయ్యారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో బీజేపీ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ భేటీ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా పురోగమిస్తోంది. ఈ ప్రయాణంలో మేమంతా కలిసికట్టుగా పనిచేశాం. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. నితిన్ నబీన్‌ను యువకుడు, ఉత్సాహవంతుడిగా అభివర్ణించిన చంద్రబాబు, ఆయన వరుస విజయాలతో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. "ప్రధాని మోదీ భారతదేశ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టారు. రైట్ టైమ్, రైట్ లీడర్, రైట్ డెసిషన్.. ఇదే నరేంద్ర మోదీ. అలాంటి కీలకమైన పార్టీకి నితిన్ నబీన్ బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం. వారి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశిస్తూ మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు.



# ఏపీ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

**నాలుగు పరీక్షలకు కొత్త తేదీలు**

**హెూలీ, రంజాన్ పండుగల నేపథ్యంలో తేదీల సవరణ**

విజయవాడ, డిసెంబర్ 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు జరిగాయి. హెూలీ, రంజాన్ పండుగల దృష్ట్యా కొన్ని పరీక్షల తేదీలను సవరిస్తూ ఇంటర్ బోర్డు శుక్రవారం కొత్త టైం టేబుల్‌ను విడుదల చేసింది. ఈ మార్పుల ప్రకారం మొత్తం నాలుగు పరీక్షల తేదీలు మారాయి. వివరాల్లోకి వెళితే, 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 3న (హెూలీ) జరగాల్సిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్ పేపర్-2ఏ, సివిక్స్ పేపర్-2 పరీక్షలను మార్చి 4వ తేదీకి వాయిదా వేశారు. అదేవిధంగా, మార్చి 20న (రంజాన్) నిర్వహించాల్సిన ప్రథమ సంవత్సరం అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1 పరీక్షలను మార్చి 21కి మార్చారు. మిగిలిన పరీక్షలన్నీ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా జరుగుతాయని బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 23 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ప్రభుత్వం ప్రకటించిన 2026 సెలవుల జాబితాను అనుసరించి ఈ మార్పులు చేసినట్లు బోర్డు తెలిపింది. సవరించిన టైం టేబుల్‌ను విద్యార్థులు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, దానికి అనుగుణంగా పరీక్షలకు సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

# విజయవాడ-విశాఖ ఎయిరిండియా విమానం రద్దు

విజయవాడ, డిసెంబర్ 19 (ఈవార్తలు): విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాన్ని చివరి నిమిషంలో రద్దు చేశారు. టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే, విమానం బయలుదేరడానికి ముందు నిర్వహించే తనిఖీల్లో పైలట్ సాంకేతిక లోపాన్ని గుర్తించారు. దీంతో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, విమానాన్ని తిరిగి ర్యాంప్ వద్దకు తీసుకువచ్చారు. అనంతరం, ముందుజాగ్రత్త చర్యగా విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి తెలిపారు. విమానం రద్దు కావడంతో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు సంస్థ



పేర్కొంది. ప్రయాణికులందరికీ హెూటల్‌లో వసతి, భోజన సదుపాయాలు కల్పించామని వెల్లడించింది. అలాగే, టికెట్ డబ్బులు పూర్తిగా వెనక్కి తీసుకోవడం (ఫుల్ రిఫండ్) లేదా మరో విమానంలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం వంటి ఆప్షన్లు అందించినట్లు వివరించింది. ఈ వారం ప్రారంభంలో కూడా జెడ్డా నుంచి కోజికోడ్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం టైరు దెబ్బతినడంతో కొచ్చిలో అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. జెడ్డా విమానాశ్రయంలోని రన్‌వేపై ఉన్న ఏదో వస్తువు తగలడం వల్ల ఈ సమస్య తలెత్తిందని అప్పట్లో సంస్థ పేర్కొంది. మరోవైపు, ఉత్తర భారతదేశంలో పొగమంచు కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం కలగొచ్చని ప్రయాణికులకు సూచనలు జారీ చేస్తోంది.




# అశ్వగంధ.. ఆయుర్వేద రారాజు

**డబ్ల్యూహెచ్‌వో సమ్మిట్‌లో మూలికపై చర్చ**

**అశ్వగంధ మొక్క పోస్టల్ ట్యాంప్ విడుదల**

న్యూఢిల్లీ: అశ్వగంధ అంటే.. ఆయుర్వేదంలో రాజు లెక్క. ఆ మూలికతో కలిగే లాభాలు అన్నీ ఇన్నీ కావు. ఒత్తిడి, నిద్రలేమి, కండరాల బలం, జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే సర్వరోగనివారిణి ఇది. ఇంతటి ఘనమైన మూలికపై డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ ట్రెడిషన్ మెడిసిన్ సమ్మిట్‌లో ఆసక్తికర చర్చ జరిగింది. 'అశ్వగంధ: ట్రెడిషనల్ విజ్డమ్ టు గ్లోబల్ ఇంపాక్ట్ - పెర్స్పెక్టివ్స్ ఫ్రమ్ లీడింగ్ గ్లోబల్ ఎక్స్‌పర్ట్స్' అనే సెషన్‌ను ఆయుష్ మంత్రిత్వ సహకారంతో డబ్ల్యూహెచ్‌వో భారత్‌లో ఈ వేడుకను నిర్వహించింది. కాగా, అశ్వగంధ మొక్కతో కూడిన చిత్రంతో పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అథానోమ్, జేపీ నడ్డా పాల్గొన్నారు.



# మల్యాల ఉపసర్పంచ్‌కు పద్మశాలీల సన్మానం

మల్యాల, డిసెంబర్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కట్కం వినయ్ కుమార్‌ను మండల పద్మశాలి సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయనను కలిసి ఉప సర్పంచ్‌గా ఎన్నికవడంపై అభినందించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ముల్క మల్లయ్య, బొమ్మకంటి గంగాధర్, పెంట సుధాకర్, కస్తూరి విశ్వనాథం, బాలె సంజీవ్, ముత్యంపేట పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షుడు చట్పల్లి చక్రధర్, ముల్క శ్రీమన్, బాలె వంశీ, జక్కని అఖిల్, సామల సతీశ్, వేముల రంజిత్, బాలె గణేశ్, బాలె విశ్వజిత్ పాల్గొన్నారు.

# వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి



మల్యాల, డిసెంబర్ 19 (ఈవార్తలు): వలలో చిక్కుకుపోయి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన నూకపల్లి వరద కాలువలో గురువారం చోటు చేసుకుంది. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన దువ్వాక నర్సయ్య(63).. గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వరద కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి వలలో చిక్కుకుని మృతి చెందాడు. రాత్రి గడిచినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం వరద కాలువ సమీపంలో నర్సయ్యకు సంబంధించిన చెప్పులు గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి వరద కాలువలోని మృతదేహాన్ని బయటకు తీశారు.



# మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు: యూబీఐ

జగిత్యాల, డిసెంబర్ 19 (ఈవార్తలు): బ్యాంకు లింకేజీ రుణాల కోసం అర్బన్ మహిళా సంఘాలు ఈ నెల 24 లోపు ప్రతిపాదనలు పంపాలని యూనియన్ బ్యాంకు సూచించింది. ఈ మేరకు శుక్రవారం మాట్లాడిన డిప్యూటీ రీజిన్ హెడ్ శ్రీలత.. ఎస్‌హెచ్‌జీ మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రుణాల లక్ష్యాన్ని పూర్తి చేసిన రిసోర్స్ పర్సన్లను ఆమె అభినందించారు. ఈ సమావేశంలో మెప్మా ఏవో శ్రీనివాస్, ఎల్డీఎం రాంకుమార్, మెప్మా టీఎంసీ రజిత, యూబీఐ బ్యాంకు మేనేజర్లు భైరవ్ నాథ్, విశాల్, ప్రీతం, ప్రశాంత్, మెప్మా ఆర్పీలు, డీఈవో మమత తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల రద్దీకి అనుగుణంగా భీమన్నగుడిలో ఏర్పాట్లు

**అధికారులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం**

వేములవాడ, డిసెంబర్ 19 (ఈవార్తలు):వేములవాడలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు, భీమేశ్వర ఆలయంలో భక్తులకు మెరుగైన వసతుల కల్పన తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఆర్‌అండ్‌బీ సీఈ, శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ ఉంటుందని వివరించారు. దానికి అనుగుణంగా వసతులు కల్పించాలని ఆలయ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయం, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులపై ఆరా తీశారు. ఆయా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్‌అండ్ బీ సీఈ రాజేశ్వరరెడ్డి, ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, వీటీఏడీఏ సెక్రటరీ



# సోలార్‌లో భారత్ పవర్

న్యూఢిల్లీ: పర్యావరణ అనుకూల సౌర విద్యుత్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత ఫలితాలను ఇస్తోంది. గత పదకొండేళ్లలో దేశంలో సౌరశక్తి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పీఎం-కుసుమ్, పీఎం సూర్య ఘర్ వంటి పథకాలు ఇందుకు దోహదపడుతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ పంప్‌సెట్‌ల నుంచి నగరాల్లో ఇంటిపైకప్పు వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగం భారీగా పెరుగుతోంది. 2014లో దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కేవలం కేవలం 3 గిగావాట్లు ఉండగా, ఇప్పుడు 40 రెట్లు పెరిగి 129 గిగావాట్లకు చేరడమే ఇందుకు ఉదాహరణ. దీంతో సౌర విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. సౌర విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో మొత్తం శిలాజేతర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సైతం భారత్ వేగంగా పెంచుకొని 259 గిగావాట్లకు తీసుకెళ్లింది. ఇది దేశంలోని మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతానికి పైనే.

## భారీ ఎత్తున సోలార్ పార్కులు



దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సోలార్ పార్కులు, అల్ట్రా-మెగా సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటే లక్ష్యంగా కేంద్రం 2014 డిసెంబర్‌లో ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించింది. దీని కింద ఇప్పటివరకు 13 రాష్ట్రాల్లో 39,973 మెగావాట్ల సామర్థ్యంతో 55 సోలార్ పార్కుల ఏర్పాటుకు అనుమతి లభించింది. ఇప్పటికే 14,922 మెగావాట్ల సామర్థ్యంలో కూడిన సోలార్ పార్కుల నిర్మాణం పూర్తై విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి.

**2014లో 3 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం**

**2025 నాటికి 129 గిగావాట్లకు పెరిగిన ఉత్పత్తి**

**కేంద్ర ప్రభుత్వ పథకాలతో భారీ పెరుగుదల**

**సౌర విద్యుత్ ఉత్పత్తిలో 3వ స్థానంలో ఇండియా**

**శిలాజేతర ఇంధన సామర్థ్యంలోనూ ముందంజ**

### పీఎం-కుసుమ్‌తో వ్యవసాయానికి సౌరశక్తి

వ్యవసాయంలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం 2019లో ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష ఈవమ్ ఉత్తమ్ మహాభియాన్(పీఎం-కుసుమ్) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 9 లక్షల స్టాండలోన్ సోలార్ పంపుసెట్లు ఏర్పాటయ్యాయి. గ్రిడ్‌కు అనుసంధానంగా మరో 10,535 సోలార్ పంప్‌సెట్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. మరో9.74 లక్షల ఫీడర్ స్థాయి సోలార్ పంపులు ఏర్పాటయ్యాయి. ఈ పథకాన్ని ప్రభుత్వం 2026 మార్చి 31 వరకు పొడిగించింది. 15 హెచ్‌పీ వరకు సౌర విద్యుత్ పంపుసెట్లకు కేంద్రం సబ్సిడీని అందిస్తోంది.

### పీఎం సూర్య ఘర్ పథకంతో ప్రోత్సాహం

గృహ విద్యుత్ వినియోగంలో సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కోటి గృహాలకు ప్రతినెలా **300** యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా రూ.**75,021** కోట్ల వ్యయంతో గత ఏడాది ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు **23.9** లక్షల గృహాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నారు. ఇందుకు కేంద్రం రూ.**13,464.6** కోట్ల సబ్సిడీని విడుదల చేసింది.

### సోలార్ పీవీల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం అవసరమైన సోలార్ ఫొటోవొల్టాయిక్ మాడ్యూళ్ల దిగుమతిని తగ్గించి, దేశంలోనే ఉత్పత్తి అయ్యేలా ప్రోత్సహించేందుకు కేంద్రం రూ.24,000 కోట్లతో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటీవ్(పీఎల్ఐ) పథకాన్ని ప్రారంభించింది. సోలార్ పీవీ మాడ్యూళ్లు ఉత్పత్తి చేసే సంస్థలకు ఈ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాలను అందిస్తోంది.

### ప్రపంచానికి ఆదర్శం

అంతర్జాతీయ సౌర కూటమి(ఐఎస్ఏ) వ్యవస్థాపక సభ్య దేశంగా సౌర విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలుస్తోంది. 125 సభ్య దేశాలు కలిగిన ఈ కూటమి ప్రధాన కార్యాలయం సైతం భారత్‌లోని గురుగ్రామ్‌లోనే ఉంది. ద్వారా ఇతర దేశాలకు సైతం ఈ రంగంలో భారత్ ఆదర్శంగా నిలుస్తోంది. దీంతో పాటు పునరుత్పాదక విద్యుత్ గ్రిడ్‌ల అనుసంధానంపై దృష్టి సారించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్(ఓఎస్ఓడబ్ల్యూఓజీ) అనే నినాదం సైతం మన్ననలు పొందింది.

సౌర విద్యుత్ ఉత్పత్తిలో 3వ స్థానంలో భారత్

పవన విద్యుత్ ఉత్పత్తిలో 4వ స్థానంలో భారత్

మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో 4వ స్థానంలో భారత్

**భారత్‌లో సౌర విద్యుత్ సామర్థ్యం:**

**2014 - 3 గిగావాట్లు**

**2025 - 129 గిగావాట్లు**





## కిలోమీటర్ ఎత్తుతో జెడ్డా టవర్

**ఇప్పటికే 80 అంతస్థుల నిర్మాణం పూర్తి**

సౌదీ: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంగా రికార్డు సృష్టించేందుకు సౌదీ అరేబియా చేపట్టిన జెడ్డా టవర్ (కింగ్‌డమ్ టవర్) నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 2025 జనవరిలో తిరిగి ప్రారంభమైన పనులు ఇప్పటికే దాదాపు 80 అంతస్తులు పూర్తి చేసుకున్నాయి. ప్రతి 3 నుంచి 4 రోజులకు ఒక కొత్త అంతస్తును నిర్మిస్తూ, 2028 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత ఎత్తైన కట్టడంగా ఉన్న దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా (828 మీటర్లు) రికార్డును జెడ్డా టవర్ బద్దలు కొట్టనుంది. దీని ఎత్తు 1,000 మీటర్లకు (ఒక కిలోమీటర్) పైగా ఉండనుంది. బుర్జ్ ఖలీఫా కంటే ఇది దాదాపు 172 నుంచి 180 మీటర్లు ఎక్కువ ఎత్తులో ఉంటుంది. ఈ ఘనత సాధించిన తొలి భవనంగా జెడ్డా టవర్ చరిత్రకెక్కనుంది. సౌదీ అరేబియా ప్రతిష్ఠాత్మక 'విజన్ 2030'లో భాగంగా ఈ టవర్‌ను నిర్మిస్తున్నారు. 160కి పైగా అంతస్తులతో నిర్మితమవుతున్న ఈ భవనంలో విలాసవంతమైన ఫోర్ సీజన్స్ హోటల్, లగ్జరీ నివాసాలు, సర్వీస్డ్ అపార్ట్‌మెంట్లు, అత్యాధునిక ఆఫీసులు ఏర్పాటు చేయనున్నారు. ఎర్ర సముద్రం, నగరం అందాలను వీక్షించేందుకు ప్రత్యేకంగా స్కై-హై అబ్జర్వేషన్ డెక్‌ను నిర్మిస్తున్నారు. బుర్జ్ ఖలీఫా డిజైనర్లలో ఒకరైన ఆడ్రియన్ స్మిత్ ఈ టవర్‌కు రూపకల్పన చేయడం విశేషం.

## ఫుడ్ యాప్‌ల కమీషన్ల దందా

**భారీగా కమీషన్లు అడుగుతున్నాయ్**

**యాప్స్ వద్దంటున్న 35 శాతం రెస్టారెంట్లు**

**లాభాలు పెరిగినా, మార్జిన్లు తగ్గుతున్నాయని వెల్లడి**

**ఎన్‌సీఏఈఆర్ సర్వేలో వెల్లడైన కీలక విషయాలు**



న్యూఢిల్లీ: భారతదేశంలో ఫుడ్ డెలివరీ యాప్‌ల వాడకంపై రెస్టారెంట్ల యజమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మూడు రెస్టారెంట్లలో ఒకటి, అవకాశం వస్తే ఈ యాప్‌లను వదిలేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఓ జాతీయ సర్వేలో తేలింది. దీనికి ప్రధాన కారణం యాప్‌లు వసూలు చేస్తున్న అధిక కమీషన్లే అని స్పష్టమైంది. అయినప్పటికీ, దాదాపు మూడింట రెండొంతుల మంది యాప్‌లతోనే కొనసాగుతామని చెప్పడం గమనార్హం. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ దేశవ్యాప్తంగా 28 నగరాల్లోని 640 రెస్టారెంట్లపై ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం, ఫుడ్ డెలివరీ యాప్‌లపై అసంతృప్తికి ముఖ్య కారణం అధిక కమీషన్లే. 2019లో సగటున 9.6 శాతంగా ఉన్న కమీషన్, 2023 నాటికి 24.6 శాతానికి పెరిగింది. ముఖ్యంగా చిన్న రెస్టారెంట్లకు బేరమాడే శక్తి లేకపోవడంతో, వారి లాభాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పాటు ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సరైన కస్టమర్ సర్వీస్ లేకపోవడం, ఆర్డర్లు బాగా వస్తున్నా లాభాలు తక్కువగా ఉండటం వంటి కారణాలు కూడా ఉన్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ, చాలా రెస్టారెంట్లు ఈ యాప్‌లనే నమ్ముకుని ఉన్నాయి. యాప్‌ల ద్వారా తమ రెస్టారెంట్ గురించి ఎక్కువ మందికి తెలియడం, తమ పరిధికి దూరంగా ఉన్న కస్టమర్లకు కూడా సేవలు అందించగలగడం వంటివి ప్రధాన ప్రయోజనాలుగా ఉన్నాయి. సొంతంగా డెలివరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోకుండానే వ్యాపారాన్ని విస్తరించుకునే అవకాశం లభిస్తోందని యజమానులు చెబుతున్నారు. ఈ సర్వే ప్రకారం, యాప్‌లలో చేరడం వల్ల 59 శాతం రెస్టారెంట్లు తమ భౌగోళిక పరిధిని విస్తరించుకున్నాయని, 52.7 శాతం రెస్టారెంట్లు మెనూలో కొత్త వంటకాలను చేర్చాయని, 50.4 శాతం మందికి కొత్త కస్టమర్లు పెరిగారని నివేదిక పేర్కొంది. మొత్తం మీద చూస్తే, ఫుడ్ డెలివరీ యాప్‌లతో రెస్టారెంట్ల బంధం లాభనష్టాల మధ్య కొనసాగుతోందని స్పష్టమవుతోంది. అధిక కమీషన్లు భారంగా మారినప్పటికీ, వ్యాపార విస్తరణకు ఈ వేదికలు తప్పనిసరిగా మారాయి.

## ఎయిర్‌పోర్టులపై అదానీ రూ.లక్ష కోట్లు

**ఐదేళ్లలో విమానాశ్రయాల వ్యాపారంలో భారీ పెట్టుబడి**

**25న నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ వాణిజ్య కార్యకలాపాలు షురూ**

ముంబై: భారత ఏవియేషన్ రంగంలో వృద్ధి అవకాశాలపై బలమైన విశ్వాసంతో ఉన్న అదానీ గ్రూప్, తమ విమానాశ్రయాల వ్యాపారంలో భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. రాబోయే ఐదేళ్లలో ఏకంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్, గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ వెల్లడించారు. ఈ నెల 25న నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనున్న నేపథ్యంలో పీటీఐతో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వివరాలు తెలియజేశారు. నవీ ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది. రూ.19,650 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయం మొదటి దశలో ఏటా 2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని 9 కోట్ల మందికి పెంచనున్నారు. ఇది ప్రస్తుత ముంబై విమానాశ్రయంపై భారాన్ని తగ్గించనుంది. భారత ఏవియేషన్ రంగం రాబోయే 10-15 ఏళ్లపాటు ఏటా 15-16 శాతం చొప్పున స్థిరంగా వృద్ధి చెందే సత్తా ఉందని జీత్ అదానీ ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి విడత విమానాశ్రయాల ప్రైవేటీకరణలో కూడా దూకుడుగా పాల్గొంటామని, 11 ఎయిర్‌పోర్ట్‌ల కోసం బిడ్ దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ముంబై, నవీ ముంబైతో పాటు అహ్మదాబాద్, లక్నో, గువాహటి, జైపూర్ వంటి ఆరు ఇతర విమానాశ్రయాలను అదానీ గ్రూప్ నిర్వహిస్తోంది. దేశంలోని మొత్తం ప్రయాణికులలో దాదాపు 23 శాతం మంది అదానీ గ్రూప్ విమానాశ్రయాల ద్వారానే ప్రయాణిస్తున్నారు.



## సర్కారు బడిలో చేరితో 5 వేలు

***మంగళూరులోని కన్నడ మాధ్యమ పాఠశాల వినూత్న ఆలోచన***

మంగళూరు: కర్ణాటకలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు, హాజరు శాతం క్షీణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మంగళూరు జిల్లాలోని ఒక కన్నడ మాధ్యమ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నమోదును ప్రోత్సహించడానికి ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన అశోకనగర్ ఉన్నత ప్రాథమిక పాఠశాల, కొత్తగా చేరిన విద్యార్థులకు ఉచిత బ్యాంకు ఖాతాలను తెరవడంతో పాటు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల విద్యను ఎంచుకునేలా ప్రోత్సహించేందుకు ప్రతి విద్యార్థి పేరు మీద రూ. 5000 మొత్తాన్ని జమ చేస్తోంది. పిల్లలను ఆకర్షించడానికి దాతల సహాయంతో ఉచిత బ్యాంకు ఖాతాలను తెరవడానికి ఇలాంటి ప్రయోగం చేయడం జిల్లాలో ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా తల్లిదండ్రులను ప్రోత్సహించడం కోసం దీనిని మొదలుపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరానికి, 1 నుంచి 3 తరగతుల వరకు 17 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలను తెరిచారు. ఒకటో తరగతిలో 10 మంది, రెండవ, మూడవ తరగతుల్లో ఏడుగురు విద్యార్థులు చేరారని, వారికి ఐదేళ్ల కాలానికి రూ.5 వేల చొప్పున నగదును ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఐదేళ్ల తర్వాత ఈ మొత్తం రూ.6,690కి పెరుగుతుంది. అంతేకాకుండా విద్యార్థులకు ఉచితంగా యక్షగానం, కరాటే, పెయింటింగ్, యోగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

## డిఫెన్స్ పాలసీకి ట్రంప్ ఓకే

వాషింగ్టన్: భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలకమైన వార్షిక రక్షణ విధాన బిల్లుపై (డిఫెన్స్ పాలసీ) సంతకం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో కొనసాగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం సాధించడానికి క్వాడ్ కూటమి ద్వారా భారత్‌తో సంబంధాలను విస్తృతం చేయాలని అమెరికా భావిస్తోంది. ట్రంప్ సంతకం చేసిన ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్-2026లో భారత్□తో రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం, క్వాడ్ కూటమి ద్వారా స్వేచ్ఛాయుతమైన, బహిరంగ ఇండో-పసిఫిక్ ప్రాంత లక్ష్యాలను సాధించడం, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొని అమెరికా ప్రయోజనాలను పరిరక్షించడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, దేశీయంగా, విదేశాల నుంచి వచ్చే బెదిరింపుల నుంచి దేశాన్ని కాపాడటానికి, రక్షణ పారిశ్రామిక రంగ పునాదులను బలోపేతం చేయడానికి ఈ చట్టం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. భారత్‌తో రక్షణ రంగంలో మరింత సహకారం ద్వారానే ఇండో-పసిఫిక్ రీజియన్ లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ఇరు దేశాల మధ్య సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ వాణిజ్యం, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సముద్ర భద్రత వంటి అంశాల్లో సహకారం వంటి ప్రయోజనాలు ఉండనున్నాయి.

## ప్రియాంకగాంధీ వయనాడ్ మూలికావైద్యం

**మోదీ, స్పీకర్ సహా ఎంపీలతో చాయ్ పే చర్చ**

న్యూఢిల్లీ: వయనాడ్ అడవులలో లభించే ఒక మూలికను తాను వాడుతున్నానని, దానివల్ల తన అలర్జీ సమస్యలు పూర్తిగా తగ్గిపోయాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పీకర్ ఓం బిర్లా, పలువురు కేంద్ర మంత్రులతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. డిసెంబర్ 1న ప్రారంభమై 19 రోజుల పాటు సాగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీవేడి చర్చలు, విపక్షాల ఆందోళనలతో హోరెత్తాయి. ఈ సమావేశాలు ముగిసిన అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు తేనీటి విందు ఇచ్చారు. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక వయనాడ్ మూలికల గురించి మాట్లాడారు. ఆమె ఇంకా మాట్లాడుతూ, ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే వికసిత్ భారత్ గ్యారెంటీ పర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లును గురువారం అర్ధరాత్రి ఆమోదించిన విషయంపై అఖిలపక్ష ఎంపీలు ప్రధానితో చర్చించారు. అర్ధరాత్రి చట్టాన్ని ఆమోదించడం ఆదర్శవంతంగా ఉండదని, కాబట్టి శీతాకాల సమావేశాలను పొడిగించి ఉండాల్సిందని ప్రధానమంత్రితో అన్నారు.

## రూపాయి రన్.. మార్కెట్లు బుల్

**447 పాయింట్లు పెరిగి 84,929 వద్ద స్థిరపడిన సెన్సెక్స్**

**151 పాయింట్ల లాభంతో 25,966 వద్ద ముగిసిన నిఫ్టీ**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం సెషన్‌ను భారీ లాభాలతో ముగించాయి. హెవీవెయిట్ షేర్లలో స్థిరమైన కొనుగోళ్లు జరగడం, రూపాయి విలువ పుంజుకోవడం వంటి అంశాలు సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ సానుకూలంగా ఉండటంతో రోజంతా మార్కెట్లలో జోరు కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 447.55 పాయింట్లు లాభపడి 84,929 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 151 పాయింట్లు పెరిగి 25,966 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 275 పాయింట్ల లాభంతో మొదలైంది. ఒక దశలో 85,067.50 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 25,993 వరకు వెళ్లింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 2 శాతానికి పైగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఏషియన్ పెయింట్స్, లార్సెన్ అండ్ టూబ్రో, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు కూడా రాణించాయి. మరోవైపు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు సుమారు 1 శాతం నష్టపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ షేర్లు కూడా నష్టాలతో ముగిశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు చెరొక 1.3 శాతం పెరిగాయి.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శనివారం 20-12-2025 || www.evarthalu.com


## వయ్యారి చిత్రం


ప్రియాంక జవల్కర్

## భర్త మహాశయులకు విజ్ఞప్తి టీజర్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ అంటేనే హై వోల్టేజ్ ఎనర్జీ. కానీ ఈ మధ్య కాలంలో ఆయన నుంచి వరుసగా సీరియస్ యాక్షన్ సినిమాలే వస్తున్నాయి. రవితేజ మార్క్ కామెడీని, ఆ టైమింగ్ ను ఫ్యాన్స్ గట్టిగా మిస్ అవుతున్నారు. ఆ లోటు తీర్చడానికే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ వస్తున్నారు. కిషోర్ తిరుమల డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పుడిప్పుడే బజ్ పెరుగుతోంది. లేటెస్ట్ గా రిలీజ్ అయిన టీజర్ ఆ అంచనాలను మరో మెట్టు ఎక్కించి, వినోదాల విందు ఖాయం అనిపించేలా ఉంది. టీజర్ స్టార్టింగ్ నుంచే రవితేజ తనదైన స్టైల్ లో నవ్వులు పూయించారు. ఇందులో ఆయన క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా, కాస్త కొంటెగా ఉంది. ఒకవైపు "నా భార్య అంటే నాకు ప్రాణం" అని అమాయకంగా చెబుతూనే, మరోవైపు బయట వ్యవహారాలు నడిపే చిలిపి భర్తగా రవితేజ చేసే రచ్చ మామూలుగా లేదు. "ఎవరైతే తప్పు చేసి.. ఆ తప్పు భార్యకు తెలిస్తే ఆమె బాధపడుతుందని భయపడతాడో.. వాడే అసలు సిసలైన మొగుడు" అనే ఫిలాసఫీ నవ్వులు తెప్పిస్తోంది. చాలా ఏళ్ల తర్వాత రవితేజలో ఆ పాత కామెడీ టైమింగ్ మళ్ళీ కనిపిస్తోంది. జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమా, పక్కాగా ఫ్యామిలీ ఎంటర్టైనర్ లా కనిపిస్తోంది. ఇక రిలీజ్ తరువాత జనాలు ఎంతవరకు ఎట్రాక్ట్ అవుతారో చూడాలి.




## ప్రీతి ముకుందన్ గ్లామర్ విందు

మంచు విష్ణు ప్రెస్టేజియస్ మూవీగా వచ్చిన కన్నప్ప సినిమాలో హీరోయిన్గా నటించి, తన అందంతో నటనతో అందరిని ఆకర్షించిన నటి ప్రీతి ముకుందన్. ఈ సినిమాతో ప్రీతి ముకుందన్ భారీ పాపులారిటీ అందుకుంది. దీంతో ఆమె గురించి తెలుసుకోవడానికి అభిమానులు కూడా ఆసక్తి కనబరిచారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో 2001 జూలై 30న జన్మించింది. ఈమె తల్లిదండ్రులు ఇద్దరూ కూడా డాక్టర్లే కావడం గమనార్హం. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో శ్రీ విష్ణు హీరోగా వచ్చిన ఓం భీమ్ బుష్ సినిమా ద్వారా తన కెరీర్ ను మొదలు పెట్టింది. అయితే ఈ సినిమాలో ఆయేషా ఖాన్ హైలెట్ అయిన రేంజ్‌లో ప్రీతి ముకుందన్ కి గుర్తింపు లభించలేదు. తర్వాత యంగ్ హీరో కెవిన్ హీరోగా వచ్చిన స్టార్ అనే సినిమాలో కూడా నటించింది. ఈ రెండు చిత్రాలతో పోల్చుకుంటే కన్నప్ప సినిమా పెద్ద మూవీ మాత్రమే కాదు ఇందులో భారీతారాగణం కూడా భాగమైంది. పైగా పాన్ ఇండియా లెవెల్లో విడుదల అవ్వడంతో ఈ సినిమాలో ఈమెకు మరింత క్రేజ్ దక్కింది. ఇప్పుడు ఇంటర్నెట్‌లో తన అందాలను ఆరబోస్తూ ఫ్యాన్స్‌కు గ్లామర్ విందు వడ్డించింది.



## కాశీలో బాలయ్య దర్శనం

వారణాసిలోని కాశీ విశ్వనాథ స్వామిని నందమూరి బాలకృష్ణ దర్శించుకున్నారు. 'అఖండ 2' చిత్రానికి వస్తున్న అపూర్వ స్పందన నేపథ్యంలో చిత్రయూనిట్‌తో కలిసి బాలయ్య ఆధ్యాత్మిక నగరమైన కాశీకి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరం సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'అఖండ 2' సినిమాలో తాను సనాతన సైనికుడిగా నటించానని, ఆ పాత్ర తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని బాలకృష్ణ వెల్లడించారు. ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను నిర్మాతలు, దర్శకుడు కలిసి కలసి సినిమా గురించి వివరించారని బాలయ్య పేర్కొన్నారు. సినిమా సందేశం, సనాతన ధర్మంపై ఉన్న అంశాలు ఆయనను ఆకట్టుకున్నాయని చెప్పారు.




## తాప్సీ అంటే అంతే మరి!

హెయిర్ స్టైల్ కొన్నాళ్ల పాటు శాపంగా మారిందని చెప్పిన తాప్సీ.. ఉంగరాల జుట్టు కారణంగా ఎన్నో సినిమా అవకాశాలను కోల్పోయానంది. రింగుల జుట్టు కేవలం యాక్షన్ పాత్రలకే సరిపో తుందని..మిగతా సినిమాలకు పనికి రాదని చాలా అవకాశాలు పోగోట్టుకుందిట. ఈ క్రమంలో ఛాన్సుల కోసం హెయిర్ ని స్ట్రెయిట్ చేయించినట్లు గుర్తు చేసుకుంది. వాస్తవానికి ఉంగరాల జుట్టు అంటే తనకీ నచ్చేది కాదట. కానీ ఉంగరాల జుట్టు ప్రత్యేకత తెలుసుకుని కాలక్రమంలో ఆ హెయిర్ ని ప్రేమించడం మొదలు పెట్టినట్లు తెలిపింది. ఉంగరాలను ఎలా సెట్ చేసుకోవాలో తెలుసుకుని తెలుసుకుని, నెమ్మదిగా దర్శకులను కూడా దారిలో పెట్టినట్లు పేర్కొంది. కొన్ని నెలల తర్వాత కొంత మంది దర్శకులు ఉంగరాల జుట్టు ఉన్న హీరోయిన్ మాత్రమే కావాలని వాళ్లతోనే అనిపించిందట. సహజంగా ఉండే హెయిర్ గొప్పతనం వారికి చెప్పడంతో చాలా మంది కన్విన్స్ అయ్యారని తెలిపింది. ఇప్పుడు ఉంగరాలు తీసేయాలా? ఉంచాలా? అనే ఆప్షన్ దర్శకులకు ఇస్తుంటే? వద్దు వద్దు ఉంగరాలు లేకపోతే ఎలా? అదే నీ ప్రత్యేకత అంటూ పొగిడేస్తున్నారంది. సినిమాల్లోనే కాదు..కొన్ని బ్రాండ్లు కూడా తన హెయిర్ స్టైల్ చూసి అగ్రిమెంట్లు చేసుకుంటాయని తెలిపింది. ఇప్పుడు ఉంగరాల జుట్టును ఓ వరంగా భావించినట్లు పేర్కొంది.



## ప్రతీదీ స్క్రిప్ట్ ప్రకారమే

కొత్త లోక సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరినీ మెస్మరైజ్ చేసింది కళ్యాణి ప్రియదర్శన్. ఆ సినిమా విజయంపై ఒక ఇంటర్వ్యూలో పాల్గొని రివ్యూలే తమకు ఊపిరి పోసాయి అని, సినిమా షూటింగ్ మొత్తం ప్రతిదీ స్క్రిప్ట్ ప్రకారమే జరిగింది అంటూ తెలిపింది. సాధారణంగా ఒక సినిమా విడుదలైంది అంటే చాలామంది ప్రేక్షకులు రివ్యూ చూసి థియేటర్ కి వస్తారన్న విషయం వాస్తవమే.



## ధురందర్ ఓటీటీ డీల్ 285 కోట్లు!

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధార్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు థియేటర్‌లలో ఈ చిత్రం దూసుకుపోతుండగా.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించి ఒక భారీ డీల్ కుదిరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా కోసం ఏకంగా రూ. 285 కోట్లు చెల్లించినట్లు టాక్ నడుస్తోంది. ఇది 'పుష్ప 2' ఓటీటీ డీల్ (దాదాపు రూ. 275 కోట్లు) కంటే ఎక్కువ అని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత, అంటే 2026 జనవరి 30న లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండటంతో, ఈ డీల్ రెండు భాగాలకు కలిపి జరిగిందా లేక మొదటి భాగానికే ఇంత భారీ మొత్తం ఇచ్చారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.








# పాండ్యా.. పవర్ ప్యాక్డ్



**తిలక్ వర్మ ధనాధన్ ఇన్నింగ్స్.. ఆఖరి టీ20లో ఆకాశమే హద్దు**

## 3-1తో సిరీస్ టీమిండియా కైవసం

**సౌతాఫ్రికా చేతుల్లో టెస్టు సిరీస్ ఓడిన భారత జట్టు, ప్రతీకారం తీర్చుకుంది. వన్డే సిరీస్‌ని 2-1 తేడాతో గెలిచిన భారత జట్టు, టీ20 సిరీస్‌ని 3-1 తేడాతో ముగించింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 30 పరుగుల తేడాతో భారీ విజయం అందుకుంది. 232 పరుగుల లక్ష్యఛేదనలో 20 ఓవర్లు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా జట్టు, 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేయగలిగింది.**

**232 పరుగుల భారీ లక్ష్యఛేదనలో రీజా హెండ్రిక్స్ 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అయితే క్వింటన్ డి కాక్ 35 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 65 పరుగులు చేసి హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. డేవాల్డ్ బ్రేవిస్ 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 31 పరుగులతో మెరుపులు మెరిపించాడు. దీంతో 11 ఓవర్లలోనే 122 పరుగులు చేసింది సౌతాఫ్రికా. అయితే బుమ్రా, డి కాక్‌ని.. హార్ధిక్ పాండ్యా, బ్రేవిస్‌ని అవుట్ చేయడంతో సౌతాఫ్రికా వికెట్ల పతనం మొదలైంది.**

అయిడిన్ మార్క్‌రమ్ 6, డేవిడ్ మిల్లర్ 18, జార్జ్ లిండే 16, మార్కో జాన్సెన్ 14 పరుగులు చేయగా డినోవాన్ ఫెర్రారియాని వరుణ్ చక్రవర్తి గోల్డెన్ డకౌట్ చేశాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 4 వికెట్లు తీయగా బుమ్రాకి 2 వికెట్లు దక్కాయి. అర్ష్‌దీప్ సింగ్, హార్ధిక్ పాండ్యా చెరో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 231 పరుగుల భారీ స్కోరు చేసింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ కలిసి తొలి వికెట్‌కి 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 21 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 34 పరుగులు చేసిన అభిషేక్ శర్మ, కార్బిన్ బాష్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఈ ఏడాది టీ20ల్లో 1602 పరుగులు చేసిన అభిషేక్ శర్మ, విరాట్ కోహ్లీ 2016లో చేసిన టీ20 పరుగుల రికార్డుకి దగ్గరగా వచ్చాడు. 2016లో విరాట్ కోహ్లీ 29 టీ20 ఇన్నింగ్స్‌ల్లో 1614 పరుగులు చేయగా ఈ ఇయర్‌లో 40 టీ20 ఇన్నింగ్స్‌లు ఆడిన అభిషేక్ శర్మ 1602 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో తొలి సారిగా తుది జట్టులో ప్లేస్ దక్కించుకున్నాడు సంజూ శాంసన్. 22 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37 పరుగులు చేసిన సంజూ శాంసన్, జార్జ్ లిండే బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మరోసారి నిరాశపరిచాడు. 7 బంతుల్లో 5 పరుగులు చేసిన సూర్యకుమార్ యాదవ్, కార్బిన్ బాష్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. హార్ధిక్ పాండ్యా, తిలక్ వర్మ కలిసి నాలుగో వికెట్‌కి 105 పరుగుల భాగస్వామ్యం జోడించారు. 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన హార్ధిక్ పాండ్యా, యువీ తర్వాత అత్యంత వేగంగా టీ20 హాఫ్ సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. 25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 63 పరుగులు చేసిన హార్ధిక్ పాండ్యా, ఆఖరి ఓవర్‌లో అవుట్ అయ్యాడు. 42 బంతుల్లో 10 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 73 పరుగులు చేసిన తిలక్ వర్మ కూడా అదే ఓవర్‌లో రనౌట్ అయ్యాడు. శివమ్ దూబే 3 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్సర్‌తో 10 పరుగులు చేశాడు.

### పాండ్యా సిక్సర్.. కెమెరామెన్‌కు గాయం

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్ధిక్ పాండ్యా విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. సౌతాఫ్రికాతో అహ్మదాబాద్ వేదికగా శుక్రవారం జరిగిన ఆఖరి టీ20లో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హార్ధిక్ పాండ్యా తొలి బంతినే సిక్సర్ తరలించాడు. అతను కొట్టిన ఈ బంతి నేరుగా డగౌట్‌లో ఉన్న కెమెరామెన్ ఎడమ భుజానికి బలంగా తాకింది. హార్ధిక్ పాండ్యా సిక్స్‌ను గమనించని సదరు కెమెరామెన్ భారత డగౌట్ దృశ్యాలను కెమెరాతో రికార్డ్ చేస్తున్నాడు. వెంటనే ఫిజియోలు అతన్ని పరిశీలించి ఐస్ ప్యాక్ ఇచ్చారు. పెద్ద గాయం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## బాగా ఆడినా సెలెక్ట్ చేయలేదు: ఇషాన్ కిషన్



తాను మెరుగైన ప్రదర్శన చేసినా భారత సెలెక్టర్లు పట్టించుకోలేదని టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ అన్నాడు. ఆ సమయంలో కాస్త బాధపడినా.. తనకు తాను సర్ది చెప్పుకున్నానని తెలిపాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025ని ఇషాన్ కిషన్ సారథ్యంలోని జారండ్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. హర్యానాతో గురువారం జరిగిన ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని జారండ్.. 69 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్(49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లతో 101) విధ్వంసకర శతకంతో జారండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన ఇషాన్ కిషన్.. ఫలితం ఆశించకుండా తన ప్రయత్నం తాను చేస్తున్నానని తెలిపాడు. ఈ విజయం తన జీవితంలో మరిచిపోలేని అద్భుతమైన క్షణమని చెప్పుకొచ్చాడు. 'నేను భారత జట్టుకు ఎంపిక కానప్పుడు చాలా బాధపడ్డాను. ఎందుకంటే నేను బాగా రాణించినా.. నాకు అవకాశం దక్కలేదు. ఇంకా నేను మెరుగ్గా ఆడలేమోనని నాకు నేను చెప్పుకున్నాను. బహుషా జట్టును గెలిపించాలేమో.. సమష్టిగా రాణించాలేమోనని భావించాను. ఇలాంటి పరిస్థితుల్లో నిరాశకు గురవ్వకుండా చూసుకోవడం కీలకం' అని తెలిపాడు.



## సంజూ.. ఒక్క సిక్స్‌తో 2 రికార్డులు

టీమిండియా వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ సంజూ శాంసన్ అరుదైన రికార్డ్స్ సాధించాడు. సౌతాఫ్రికాతో అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఐదో టీ20లో అనూహ్యంగా తుది జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్.. అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గాయంతో జట్టుకు దూరమవడంతో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ శాంసన్.. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. 22 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37 పరుగులు చేసి ఓపెనింగ్ స్థానానికి తానే సరైనోడినని చాటి చెప్పాడు. ఈ మ్యాచ్ రెండో ఓవర్‌లో పికప్ షాట్‌తో లాంగాన్ దిశగా భారీ సిక్స్ బాదిన సంజూ శాంసన్.. రెండు అరుదైన రికార్డ్‌లను తన పేరిట లిఖించుకున్నాడు. ఈ సిక్స్‌తో అంతర్జాతీయ టీ20ల్లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న సంజూ శాంసన్.. కేరళ తరఫున టీ20ల్లో 8000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. సంజూ కొట్టిన షాట్‌కు ఫిదా అయిన కామెంటేటర్.. 'సంజు శాంసన్ చాలా అద్భుతమైన ఆటగాడు. అతను చాలా కాలంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. కానీ అతను ఆ షాట్ ఆడిన తీరు ఆశ్చర్యకరంగా ఉంది. మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా సడెన్‌గా మైదానంలోకి దిగి ఆడినట్లుగా లేదు. బంతిని అతను టైమింగ్ చేసిన విధానం అంత సులువు కాదు.'అని కొనియాడాడు.

## బుమ్రా జాగ్రత్తగా ఉండాల్సిందే: ఊతప్ప

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు టీమిండియా తమ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను జాగ్రత్తగా చూసుకోవాలని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. వినూత్నమైన యాక్షన్, వేగం వల్ల జస్‌ప్రీత్ బుమ్రా శరీరం అధిక ఒత్తిడికి గురవుతోందని తెలిపాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజయం సాధించాలంటే బుమ్రా రాణించడం కీలకమని ఊతప్ప అభిప్రాయపడ్డాడు. 'బుమ్రా ఒక మ్యాచ్ విన్నర్. అతని వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను సరిగ్గా నిర్వహించాలి. క్రికెట్‌లో పేసర్లకు అనేక సవాళ్లు ఉంటాయి. పైగా బుమ్రాది వినూత్న బౌలింగ్ యాక్షన్. అలాగే వేగంగా బౌలింగ్ చేస్తాడు. ఈ కారణంగా అతని శరీరంపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. బుమ్రాను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఆ సమయంలో అతను తగినంత క్రికెట్ ఆడేలా చూడాలి. ఆటలో మనం అతని ప్రతిభను చూశాం. రానున్న టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో అతను మరింత నిలకడగా రాణిస్తాడని ఆశిస్తున్నా. సౌతాఫ్రికా మంచి పోటీ ఇస్తోంది. కానీ ఈ టీ20 సిరీస్‌లో ఆశించిన రీతిలో రాణించలేదు. కానీ వారి బౌలింగ్ అద్భుతంగా ఉంది. కానీ బ్యాటింగ్ బాలేదు. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఆఖరి టీ20 రసవత్తరంగా సాగనుంది.





## పంజాబ్‌కు జోష్ ఇంగ్లిష్ వెన్నుపోటు!

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ జోష్ ఇంగ్లిస్ లభ్యతపై నెలకొన్న సందిగ్ధత ఇప్పుడు ఐపీఎల్ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున అద్భుతంగా రాణించిన జోష్ ఇంగ్లిస్.. ఇప్పుడు అదే జట్టుకు నమ్మకద్రోహం చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం రూ.8.6 కోట్ల భారీ ధర కోసం జోష్ ఇంగ్లిస్ పంజాబ్ యాజమాన్యాన్ని తప్పుదోవ పట్టించాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్ 2026 రిటెన్షన్ ప్రక్రియ ముగియడానికి కేవలం 45 నిమిషాలకు ముందు ఇంగ్లిస్ ఓ మెయిల్ ద్వారా పంజాబ్ కింగ్స్ జట్టుకు షాకింగ్ సమాచారం ఇచ్చాడు. ఏప్రిల్ 18న తన వివాహం ఉందని, ఆ కారణంతో వచ్చే సీజన్‌లో కేవలం 4 మ్యాచ్‌లకు మాత్రమే తాను అందుబాటులో ఉంటానని



వెల్లడించాడు. పూర్తి సీజన్ ఆడే ప్లేయర్ కావాలని కోరుకున్న పంజాబ్ కింగ్స్.. ఇంగ్లిస్ మాటలను నమ్మి అతడిని వేలంలోకి వదిలేయక తప్పలేదు. అయితే డిసెంబర్ 16న అబుదాబిలో జరిగిన వేలంలో సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. కేవలం 4 మ్యాచ్‌లే అందుబాటులో ఉంటాడని తెలిసి కూడా లక్నో సూపర్‌జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జోష్ ఇంగ్లిస్ కోసం హోరాహోరీగా పోటీ పడ్డాయి. చివరకు లక్నో జట్టు రూ.8.6 కోట్లు వెచ్చించి అతడిని కొనుగోలు చేసింది. ఓ ప్లేయర్ కేవలం 4 మ్యాచ్‌లకే అందుబాటులో ఉంటే ఇతర జట్లు అంత భారీ ధర ఎందుకు చెల్లిస్తాయనేది పంజాబ్ కింగ్స్ యాజమాన్యాన్ని కలచివేస్తోంది. ఈ వ్యవహారంలో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. లక్నో, హైదరాబాద్ ఫ్రాంచైజీలకు జోష్ ఇంగ్లిస్ లభ్యతపై ముందే పూర్తి స్పష్టత ఉన్నట్లు సమాచారం. ఆ రెండు జట్ల కోచ్‌లు (జస్టిన్ లాంగర్, డానియల్ వెట్టోరి) ఆస్ట్రేలియా క్రికెట్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన వారు కావడంతో, ఇంగ్లిస్ తన పెళ్లి తర్వాత హనీమూన్‌ను వాయిదా వేసుకుని మరీ ఐపీఎల్ ఆడతాడనే విషయం వారికి ముందే తెలుసని పంజాబ్ భావిస్తోంది. వేలం ముగిసిన తర్వాత ఇంగ్లిస్ తన ప్లాన్స్ మార్చుకోవడం పంజాబ్ యజమాని నెస్ వాడియాకు ఆగ్రహం తెప్పించింది.



ఒక దేశం కేవలం భౌగోళిక సరిహద్దుల సమూహం కాదుబీ అది కొన్ని కోట్ల హృదయాల స్పందన. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారతదేశం నేడు ఒక విభిన్నమైన సంధి కాలంలో ఉంది. ఒకప్పుడు బ్రిటీష్ పాలనను గడగడలాడించిన ఐక్యత, "జాతి ప్రయోజనమే పరమావధి" అన్న నినాదం నేడు స్వార్థ రాజకీయాల నీడలో, కులమతాల కుమ్ములాటల మధ్య క్రమంగా మసకబారుతోంది. దేశ భక్తి అంటే కేవలం సరిహద్దుల్లో సైనికుల వీరత్వాన్ని పొగడటం మాత్రమే కాదు, పౌరుల మధ్య సోదరభావాన్ని కలిగి ఉండటం. కానీ, ప్రస్తుత సామాజిక పరిణామాలను గమనిస్తే.. జాతీయవాదం కంటే స్వార్థం, కులమతాలకే ప్రాధాన్యత పెరుగుతోందని స్పష్టమవుతోంది.

# దేశం.. భావోద్వేగం!



శశిధర్ అక్కెల

స్వాతంత్ర్య పోరాట కాలంలో జాతీయవాదం అంటే 'త్యాగం'. భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి వీరులకు దేశం అంటే ఒక భావోద్వేగం. అప్పట్లో కులం గురించి ఎవరూ అడగలేదు, మతం గురించి చర్చించలేదు. ప్రతి ఒక్కరూ తాము భారతీయులమనే గర్వంతో ముందుకు సాగారు. కానీ 2025 నాటికి ఈ భావన తీవ్రంగా మార్పు చెందింది. నేడు జాతీయవాదం అనేది తరచుగా ఎన్నికల నినాదంగా లేదా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలకు ఆయుధంగా మారుతోంది. నిజమైన దేశభక్తి పౌరుడి బాధ్యతలో ప్రతిబింబించాలి. కానీ నేడు పౌర ధర్మం కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్న సందర్భాలు కోకొల్లలు. 'నేను.. నా కుటుంబం.. నా లాభం' – ఇదే నేటి ఆధునిక మనిషి మంత్రం. ఈ స్వార్థం అనే వ్యాధి సమాజంలోని ప్రతి వ్యవస్థను పట్టిపీడిస్తోంది. దేశం కోసం పన్నులు చెల్లించడం భారంగా భావించడం, అవినీతి మార్గాల్లో సంపాదించడం గొప్పగా చెప్పుకోవడం మనం చూస్తున్నాం. దేశ సంపదను కొల్లగొట్టి విదేశాలకు పారిపోయే వ్యక్తుల సంఖ్య పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు. రేపటి తరం గురించి ఆలోచించకుండా ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడటం కూడా ఒక రకమైన జాతీయ వ్యతిరేక చర్యే. నదులను కలుషితం చేయడం, అడవులను నరికివేయడం వెనుక కేవలం మనిషి స్వార్థమే ఉంది. అధికారం కోసం ఏదైనా చేయడానికి వెనుకాడని నాయకత్వం నేడు రాజ్యమేలుతోంది. దేశాభివృద్ధి కంటే తమ పార్టీ మనుగడ, వంశపారంపర్య రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. భారతదేశానికి కులం



ఒక శాపం అయితే, మతం ఒక సున్నితమైన ఆయుధంగా మారింది. రాజ్యాంగం సమానత్వాన్ని ప్రబోధించినా, వాస్తవంలో కులం అనేది వేళ్లూనుకుపోయింది. నేడు అభ్యర్థుల ఎంపిక నుంచి మంత్రుల పదవుల వరకు ప్రతిదీ కుల సమీకరణాల ఆధారంగానే జరుగుతోంది. ప్రతిభకు కాకుండా కులానికి ఇచ్చే ఈ ప్రాధాన్యం వల్ల సమర్థవంతమైన పాలన కుంటుపడుతోంది. సాంకేతికత పెరిగిన కొద్దీ మనుషుల మధ్య దూరం తగ్గాలి, కానీ విద్వేషం పెరుగుతోంది. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే ప్రసంగాలు జాతీయ భావాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒకరి కులాన్ని లేదా మతాన్ని కించపరచడమే వీరత్వం అనుకునే తరం తయారవుతోంది. ఇది యువతను దేశ నిర్మాణ పనుల నుంచి మళ్లించి, విద్వేషాల వైపు మలుపుతోంది. నేటి విద్యా విధానం ర్యాంకుల వేటలో పడి విలువలను విస్మరించింది. పిల్లలకు దేశ చరిత్రను, రాజ్యాంగ విలువలను, సామాజిక బాధ్యతను నేర్పడంలో విఫలమవుతున్నాం. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం చదువుతున్నారే తప్ప, దేశానికి తాము ఏం చేయగలమనే ఆలోచన చేయడం లేదు. ఫలితంగా మేధోవలస పెరుగుతోంది. దేశం అందించిన వనరులతో చదువుకుని, విదేశాలకు వెళ్లి ఆ దేశాల అభివృద్ధికి తోడ్పడటంలో ఉన్న స్వార్థం జాతీయవాదాన్ని వెక్కిరిస్తోంది.

## పునఃనిర్మాణం ఎక్కడ మొదలవ్వాలి?

పాఠశాల స్థాయి నుంచే కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, దేశభక్తిని బోధించాలి. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు కేవలం పరీక్షల కోసమే కాకుండా స్ఫూర్తి కోసం చదవాలి. కులమతాల ప్రాతిపదికన ఓట్లు అడిగే ధోరణిని ప్రజలే తిప్పికొట్టాలి. అభివృద్ధి, విద్య, వైద్యం వంటి అంశాలే ఎన్నికల ప్రధాన ఎజెండా కావాలి. యువత తమ శక్తిని విద్వేషాలకు కాకుండా నవకల్పనలకు ఉపయోగించాలి. సోషల్ మీడియాను దేశ గౌరవాన్ని పెంచే విధంగా వాడాలి. చట్టం ముందు అందరూ సమానమే అనే భావన బలంగా ఉండాలి. కులం లేదా మతం చూసి శిక్షలు తగ్గడం లేదా పెరగడం ఉండకూడదు. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ మాటలను మనం మరోసారి మననం చేసుకోవాలి. మనుషుల మధ్య విభజన ఉన్నచోట జాతీయవాదం వర్ధిల్లదు. మనలో ఉన్న స్వార్థాన్ని విడనాడి, కులమతాల సంకెళ్లను తెంచుకుని, భారతీయులుగా ఒక్కటైనప్పుడే మన దేశం నిజమైన ప్రగతి పథంలో పయనిస్తుంది. జాతీయవాదం అంటే కేవలం జెండా ఎగురవేయడం కాదు, పక్కవాడి ఆకలిని గుర్తించడం, సాటి మనిషిని గౌరవించడం. ఆ దిశగా అడుగులు వేయడం నేటి తక్షణావశ్యం. భారతదేశం ప్రపంచ గురువుగా నిలవాలంటే, అది మొదట తన పౌరుల హృదయాల్లో ఐక్యతను సాధించాలి.

# సర్పంచ్ విశేషాధికారాలు




ఒక గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్‌కు కేవలం సాధారణ పరిపాలనా బాధ్యతలే కాకుండా కొన్ని కీలకమైన విశేషాధికారాలు, నిర్ణయాధికారాలు ఉన్నాయి. గ్రామ సభ లేదా పంచాయతీ తీర్మానం కోసం వేచి చూడకుండా, అత్యవసర సమయాల్లో (ఉదాహరణకు ప్రకృతి వైపరీత్యాలు, పైపులైన్ లీకేజీలు) నిర్దేశిత పరిమితి వరకు నిధులను ఖర్చు చేసే అధికారం సర్పంచ్‌కు ఉంది. గ్రామ పంచాయతీ సమావేశంలో ఏ అంశాల మీద చర్చ జరగాలి, వేటికి ప్రాధాన్యం ఇవ్వాలి అనేది సర్పంచ్ నిర్ణయిస్తారు. పంచాయతీ సమావేశంలో ఏదైనా తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు, అనుకూల, వ్యతిరేక ఓట్లు సమానంగా వస్తే, సర్పంచ్ తన 'కాస్టింగ్ ఓటు' ఉపయోగించి తుది నిర్ణయం తీసుకోవచ్చు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇతర క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరును పర్యవేక్షించే అధికారం సర్పంచ్‌కు ఉంటుంది. వారి సెలవులను ఆమోదించడం లేదా వారి పనితీరుపై పై అధికారులకు నివేదించే హక్కు ఉంటుంది. గ్రామ అవసరాల దృష్ట్యా తాత్కాలిక సిబ్బందిని లేదా పారిశుధ్య కార్మికులను నియమించుకోవడంలో సర్పంచ్ కీలక పాత్ర పోషిస్తారు. గ్రామ కంఠం (గ్రామ భూమి), చెరువులు, కాలువలు, బహిరంగ ప్రదేశాలలో జరిగే ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించడానికి అధికారుల సహాయంతో చర్యలు తీసుకునే విశేషాధికారం సర్పంచ్‌కు ఉంది. గ్రామంలో కొత్త భవనాల నిర్మాణాలు, లేఅవుట్లు లేదా వాణిజ్య ప్రకటనల బోర్డుల ఏర్పాటుకు ప్రాథమిక అనుమతులు ఇచ్చే అధికారం సర్పంచ్ నేతృత్వంలోని పంచాయతీకి ఉంటుంది. గ్రామంలో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమమైనా (స్కూల్ ఫంక్షన్లు, ఆరోగ్య శిబిరాలు, ప్రారంభోత్సవాలు) సర్పంచ్ అధ్యక్షతన లేదా వారి సమక్షంలోనే జరగాలి. ఇది వారికి రాజ్యాంగం కల్పించిన ప్రోటోకాల్ హోదా. గ్రామ పంచాయతీకి సంబంధించిన రిజిస్టర్లు, నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లను ఏ సమయంలోనైనా తనిఖీ చేసే అధికారం సర్పంచ్‌కు ఉంటుంది. గ్రామంలో ఏదైనా ప్రభుత్వ అధికారిక కార్యక్రమం, ప్రారంభోత్సవం లేదా గ్రామసభ కలెక్టర్ సమక్షంలో జరుగుతుంటే, గ్రామ ప్రథమ పౌరుడిగా సర్పంచ్‌ను ఆహ్వానించడం, వేదికపై తగిన గౌరవం ఇవ్వడం ప్రోటోకాల్ ప్రకారం తప్పనిసరి. ఈ విశేషాధికారాలు అన్నీ గ్రామ పంచాయతీ తీర్మానాలకు, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. అధికార దుర్వినియోగానికి పాల్పడితే, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కలెక్టర్ ఆ సర్పంచ్‌ను పదవి నుండి తొలగించే అవకాశం కూడా ఉంది.

- విశ్వనాథం అల్లెల, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.